www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 108 మంగళవారం, సెప్టెంబర్ 01, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

- పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ..?
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- అంబర్‌పేట సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి









**హైదరాబాద్,ఆగస్టు 31 :** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో

మిగతా2లో...



# కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 31 :** ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్

మిగతా2లో...

## కృష్ణా జలాలు తోచుకుపోతుంటే చోద్యం

- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు




## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

వేయి రోజుల్లో కెసిఆర్‌కు
కోటి 24 లక్షల 40 వేల జీతభత్యాలు
ఆందోళనలకు పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి




# ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు
- ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు



**హైదరాబాద్,ఆగస్టు 31 :** ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు, ఐటీ?పరిశ్రమల శాఖ

మిగతా2లో...



## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం
- యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి

**లక్నో,ఆగస్టు 31 :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాం బి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర

మిగతా2లో...

# ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

● 22ఎతో ప్రజలను కాల్చుకు తింటున్నారు ● ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది ● సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా



**సిద్ధిపేట,ఆగస్టు 31 :** భూమి వివరాల కోసం బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం

మిగతా2లో...




## తండ్రీ, బిడ్డను విడదీసిన ప్రశాంత్‌రెడ్డి

- శకుని పాత్ర పోషించిన వేముల ప్రశాంతరెడ్డి
- జీవితంలోల ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- నిప్పులా తిరిగి వచ్చానని భావోద్వేగానికి గురి
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు

# భూభారతితో దశాబ్దాల భూసమస్యలకు చెక్

● సర్వే చేసి రైతులకు భూ ఆధార్‌తో పాస్‌బుక్కులు

● విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: మంత్రి పొంగులేటి



# అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు.

16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు.కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు.ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధ రించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

# ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్థం లేని విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ ఎస్ అయినా.. నేడు కాంగ్రెస్ అయినా టైటిల్ మారింది తప్ప, దోపిడి విధానాలు మారలేదని వ్యంగ్యంగా అన్నారు. 03 సర్వే నెంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు సమస్యల్లో ఉంటే వేలాది ఎ÷–లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. అదే సర్వే నెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు మాత్రం 22 ఏ నుంచి బయటకు ఎలా వచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకుని ప్రభుత్వం అమ్ముకుంటున్నదని విమర్శించారు. మ భూములు కాపాడండంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. 22 ఏ నిషేధిత జాబితాపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 ఏపై స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారి కోసం జైలుకైనా వెళ్తామని పేర్కొన్నారు.

అసెంబ్లీ ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం 22ఏ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ చీఫ్ రామచందర్ రావు సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులకు, పేదలకు న్యాయం అన్నారని ఆ పార్టీ నేతలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. కానీ ఇప్పుడు పేదలు, రైతుల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పయింది సరి చేస్తామన్నారని చెప్పారని.. కానీ పేదలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ÷ఔములు విక్రయిస్తేనే రాష్ట్రాభివృద్ధి అంటున్నారని రేవంత్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. భూమి విక్రయాలను గొప్పగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 22 ఏ రైతుల భూమి మీద పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు కష్టం వస్తే తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూభారతి తెస్తే రైతు కష్టం తీరుతుందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు, రెవెన్యూ మంత్రి భూములు కూడా 22 ఏలో పడ్డాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తులు ఇప్పుడు ప్రజలకు చూపాలని డిమాండ్ చేశారు. గుంపు మేస్త్రి దరఖాస్తు బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. మీ భూములు ఏ దరఖాస్తులు లేకుండా 22 ఏలో నుంచి ఎలా తీసేస్తారని ఈ సందర్భంగా వారిని సూటిగా ప్రశ్నించారు. మరి రైతుల భూములు ఎందుకు తియడం లేదని వారిని సందేహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరిట భూములు లాక్కున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ఇక్కడి భూములు విక్రయించి.. ఆ సూట్ కేసులు ఢిల్లీకి మోస్తున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకో ఏడాది అయితే కాంగ్రెస్‌లో కార్యకర్తలు ఎవ్వరు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములు నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 7వ తేదీ లోగా 22 ఏ జీవో తొలగించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు.

## ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని ఈ వార్‌రూమ్ ద్వారా మరింత బలోపేతం చేయాలని అన్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్ల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. అడ్వైజరీ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, హాస్పిటాలిటీ కమిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్ కమిటీ, మీడియా?కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్ కమిటీ, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి , వారితో సమావేశాలు నిర్వహించి సమ్మిట్ కార్యాచరణపై చర్చించాలని తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వివరించేలా కార్యక్రమ రూపకల్పన ఉండాలని సూచించారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని ఢిల్లీలో రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?2026పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేసి సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ రోజువారీ పురోగతి నివేదికను రూపొం దించి తనకు అందజేయాలని ఎలానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి కమి టీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసు కోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరి చయం చేసేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

## కృష్ణా జలాలు తోచుకుపోతుంటే చోద్యం

**హైదరాబాద్,ఆగస్టు 31 :** కృష్ణా జలాలలను ఎపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండి పడ్డారు. నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిప డ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నె÷–టటెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ రావు అన్నారు.

## తండ్రి, బిడ్డను విడదీసిన ప్రశాంత్‌రెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 31:**'బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణే తమ లక్ష్యం' అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న సంకల్పంతో పార్టీని ఏర్పాటుచేశానని తెలిపారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో ఐదుకు ఐదు సీట్లు గెలుస్తామని ప్రకటించారు. పార్టీ ఏర్పాటు అనంతరం తొలిసారి నిజామాబాద్ వచ్చిన కవితకు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్‌ను ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ కూడా మౌనం వహిస్తోందని విమర్శించారు**వేముల ప్రశాంత్‌రెడ్డిని క్షమించను...** బీఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను, తన తండ్రి కేసీఆర్‌ను రాజకీయం గా దెబ్బతీయడంలో ఆయనదే ప్రధాన పాత్ర అని ఆరోపించారు.

## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 11 మంది మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటన పిప్రి పోలీస్ స్టేషన్ పరిధి మనోరి గ్రామంలో చోటుచేసుకుంది. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జహన్వి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అన్ష్ (6), నానా (4)గా పోలీసులు గుర్తించారు. మృతులంతా ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివసిస్తున్న వారేనని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వేళ బాణసంచా కర్మాగారంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు స్థానికంగా బీభత్సం సృష్టించి ంది. భారీ శబ్దంతో పేలుడు జరగడంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఇళ్లని పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్రంగా గాయపడిన 16 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్ఆర్ఎన్ ఆస్పత్రికి తరలించగా.. 11 మంది చికిత్సపొందుతూ మరణించారని జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందికి పైగా గాయపడి నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ వాటి కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'కౌశాంబి జిల్లాలో ప్రమాదం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశాం' అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

**హైదరాబాద్,ఆగస్టు 31 :** కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నా రు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బులెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంబర్‌పేట సభలో సిఎం మాట్లాడుతూ కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.' అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు.

ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరిందన్నారు.

## భూభారతితో దశాబ్దాల భూసమస్యలకు చెక్

**మహబూబాబాద్,ఆగస్టు 31** : రాష్ట్రంలో రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న దశాబ్దాల భూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూ భారతి రీ-సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపు తున్నామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణ పురంలో దాదాపు 60 ఏళ్లుగా పరిష్కారం కాని అసైన్డ్ భూముల సమస్యను భూ భారతి రీ-సర్వే ద్వారా పరిష్కరించి, 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూ ఆ ధార్‌తో కూడిన పట్టా దార్ పాస్ బుక్కులను మంత్రి గారు పంపిణీ చేశారు. సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. తెలంగాణలో 125 ఏళ్ల క్రితం భూ సర్వే జరిగిందని, ఆ తర్వాత ఇంతవరకు సమగ్ర సర్వే జరగలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నూ, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం కూడా భూముల సమగ్ర సర్వేపై కనీసం ఆలోచన చేయలేదని విమర్శించారు. ÷ఎఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి స్థానంలో భూ యజమానులకు అండగా నిలిచేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రాన్ని భూ వివాదాలు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ÷–రతి అంగుళం భూమిని సర్వే చేసి, క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కూడిన పట్టాదార్ పాస్ బుక్కులను రైతులు, భూ యజమానులకు అందిస్తున్నామని చెప్పారు. నాలుగు రోజుల క్రితం తుంగతుర్తిలో 13 గ్రామాలకు చెందిన రైతులకు 3,400 ఎకరాలకు పట్టాలు అందించామని, ఇప్పుడు నారాయణపురంలో 780 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇవన్నీ భూభారతి ద్వారానే సాధ్యమవుతున్నాయని అన్నారు. నారాయణపురంలో ఇంకా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న సుమారు 150 ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించిన సమస్యను కూడా త్వరలో పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ÷ూష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి అర్హుడికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇందిరమ్మ ఇళ్లు ఉన్న గ్రామాలు, వార్డుల్లోనే ఓట్లు అడుగుతామని అన్నారు. ఇందిరమ్మ పరిపాలనలో రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశామని గుర్తుచేస్తూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అందుబాటులో లేని గత రెవెన్యూ మంత్రులు ఇప్పుడు భూ సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి దశాబ్దాలుగా ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని బీఆర్ఎస్‌కు ఇప్పుడు ప్రజాప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రి స్పష్టం చేశారు. మంచి పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకాడబోమన్నారు. 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యలు తదితర అంశాల్లో నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి నెల కనీసం ఒకటి, రెండు సార్లు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశాలకు డిప్యూటేషన్ పేరుతో సంతకాలు చేసి కొందరు తహసీల్దార్లు/ఎంఆర్వోలు హాజరు

# మంథని ప్రజావాణికి కరువైన అధికారులు..




**మంథని, ఆగష్టు 31**
ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం మంథనిలో అపహాస్యం అవుతుంది.సమయం 11 గంటలు దాటిన కూడా సంబంధిత ప్రజావాణికి హాజరయ్యే కొన్ని శాఖల అధికారులు హాజరుకాలేదు.
అంతే కాకుండా జిల్లాలో కాకుండా మండల కేంద్రాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా ప్రజలకు అవగాహన కల్పించడం లేదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.ప్రభుత్వ లక్ష్యాలకు కొందరు ప్రభుత్వ అధికారులు తూట్లు పొడుస్తున్నారని ఫిర్యాదుదారులు ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నారు.ప్రజావాణి జరిగే ఎంపీడీవో కార్యాలయంలో దుర్వాసన వెదజల్లుతూ.. అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులు ముక్కున వేలేసుకుంటున్నారు.కనీస సౌకర్యాలు లేవని ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు

# వినాయక ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం

**- నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి**



**కుత్బుల్లాపూర్: ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు గణేష్ నిమజ్జనాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించింది. సుచిత్రలోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకీష్ కుమార్, డీసీపీ కోటిరెడ్డి, వివిధ శాఖల డిప్యూటీ కమిషనర్లు, ఏసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వాటర్ వర్క్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.వినాయక మండపాల ఏర్పాటు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ పనుల పూర్తి, నిమజ్జన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలను జోనల్ కమిషనర్ పింకీష్ కుమార్, డీసీపీ కోటిరెడ్డి వివరించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్, కో-కన్వీనర్లు జయశంకర్, బలరాం గత ఏడాది ఉత్సవాల్లో ఎదురైన సమస్యలు, లోటుపాట్లను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈసారి వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. విద్యుత్, పోలీస్ శాఖల అనుమతులు సకాలంలో మంజూరు చేయడంతో పాటు రోడ్లపై గుంతలను పూడ్చడం, పెండింగ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయడం, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ నెల 7వ తేదీలోపు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సమితి ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలో గణేష్ మండపాల ఏర్పాటు లేదా భక్తులకు అవసరమైన మౌలిక వసతులకు సంబంధించి సమస్యలు ఎదురైతే సమితి దృష్టికి తీసుకురావాలని కోరారు. అధికారులు, భక్తులు, మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమితి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, ఏసీపీలు, పోలీస్ అధికారులు, విద్యుత్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమితి తరపున బౌరంపేట్ డివిజన్ కన్వీనర్లు కృష్ణారెడ్డి, కొంపల్లి సతీష్ సాగర్, సుభాష్‌నగర్ నుంచి విగ్నేష్, కుత్బుల్లాపూర్ నుంచి శరత్ గౌడ్, జీడిమెట్ల నుంచి శంకర్, జగద్గిరిగుట్ట నుంచి మాధవులు, కో-కన్వీనర్లు అశోక్ నాయక్, కౌశిక్ నాయుడు, మాధవరావు, ఎల్లస్వామి, రాజు, నవీన్, శ్రీనివాస్ యాదవ్, కీర్తి శ్రీనివాస్, లానా, లీగల్ సెల్ ఇన్‌చార్జ్ శివానంద్, మహిళా ఇన్‌చార్జ్ సువాసిని శక్తి, అంకం సతీష్, కూకట్‌పల్లి--కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో సెప్టెంబర్ 1 నుంచి పోలీస్ యాక్ట్ అమలు

**- ధర్నాలు.. రాస్తారోకోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి**
**- మెదక్ జిల్లా ఎస్పీ డి. వి శ్రీనివాస రావు ఐపీఎస్**




**మెదక్,ఆగస్టు,31**
మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సెప్టెంబర్ 1 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ -- 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఈసమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు,నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు.అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ప్రజలు,ప్రజా ప్రతినిధులు,వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# రెడ్డిపల్లిలో భూభారతి రీ సర్వే



**చేగుంట,ఆగస్టు,31**
చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో భూభారతి రీ సర్వే పనులను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల సర్వేయర్ మొగులయ్య, సర్వేయర్లు ఎస్.రమణ, బాలకృష్ణ మాట్లాడుతూ.. భూముల రీ సర్వేలో ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. భూభారతి రీ సర్వే పై ప్రజలు కూడా సహకరించాలని కోరారు. తొలి విడత పైలెట్ ప్రాజెక్టుగా ఇబ్రహీంపూర్, రెడ్డిపల్లి, రాంపూర్, చేగుంట గ్రామాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. రైతులందరూ సహకరించాలని కోరారు.

# ఎస్‌బీటీఈటీ అస్తిత్వంపై రౌండ్ టేబుల్ సమావేశం

**- సెప్టెంబర్ 1న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహణ**











**హైదరాబాద్: ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో నంబర్ 97పై నెలకొన్న సందేహాలు, పాలిటెక్నిక్ విద్యారంగంపై దాని ప్రభావం, సాంకేతిక విద్య భవిష్యత్ తదితర అంశాలపై చర్చించేందుకు SBTET అస్తిత్వం -- నేటి సవాళ్లు -- పరిష్కారం" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ తెలిపారు.సెప్టెంబర్ 1, 2026న ఉదయం 10:30 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్‌లను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, విద్యార్థుల్లో నెలకొన్న అనేక సందేహాలు ఇంకా నివృత్తి కాలేదని పేర్కొన్నారు.జీవో నంబర్ 97పై పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సమస్యపై అన్ని వర్గాలతో సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఎరవెల్లి జగన్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ అస్తిత్వం, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి హాజరు కావాలని పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల ప్రతినిధులు హై లెవల్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు.సమావేశానికి ఎరవెల్లి జగన్ (JNTUH), తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అధ్యక్షత వహించనుండగా, జనార్ధన్ కన్వీనర్‌గా, ఆజాద్ కో-ఆర్డినేటర్‌గా, శ్రవణ్ కో-కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.పాలిటెక్నిక్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సాంకేతిక విద్యాభిమానులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా సెక్రెటరీగా రాంపల్లి యాదగిరి గౌడ్

- పీర్జాదిగూడలో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటమే గుర్తింపుగా ఎదిగిన నాయకుడు
- సామాన్య కార్యకర్త నుంచి జిల్లా స్థాయి బాధ్యతల వరకు రాంపల్లి యాదగిరి గౌడ్ ప్రయాణం...



**మేడ్చల్ జిల్లా, ఆగస్టు 31 (పిపిల్స్ న్యూస్):**
సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి.. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ.. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ.. క్రమంగా ప్రాంతీయ నాయకుడిగా ఎదిగిన రాంపల్లి యాదగిరి గౌడ్‌కు బీజేపీ మరో కీలక బాధ్యత అప్పగించింది. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా సెక్రెటరీగా రాంపల్లి యాదగిరి గౌడ్ నియమితులయ్యారు. ఈ నియామకం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మలుపుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పీర్జాదిగూడ ప్రాంతంలో పార్టీ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం.. నాయకుడిగా, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించే స్థాయికి చేరింది. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల్లో ఉండటం, ప్రజా సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఆయన రాజకీయ శైలిలో ప్రధానంగా కనిపిస్తుందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

**పదవి కోసం కాదు.. ప్రజల్లో ఉండే నాయకుడిగా..**
రాంపల్లి యాదగిరి గౌడ్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. ఆయన ఎదుగుదల ఒక్కసారిగా వచ్చినది కాదనే విషయం స్పష్టమవుతుంది. పార్టీ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొంటూ, కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ, స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండటం ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పీర్జాదిగూడ ప్రాంతంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సమస్య పరిష్కారం అయ్యే వరకు వాటిపై ఫాలోఅప్ చేయడం ఆయన పని తీరులో ఒక భాగంగా మారింది. రోడ్లు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజలకు సంబంధించిన స్థానిక సమస్యలపై స్పందిస్తూ ప్రజల మధ్య ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల విషయంలో అందరితో కలిసి పనిచేసే విధానం ఆయనకు మరింత పరిచయాన్ని తీసుకువచ్చిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**పీర్జాదిగూడ నుంచి జిల్లా స్థాయికి**
ఒక ప్రాంతానికి పరిమితమైన కార్యకర్తగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం.. ఇప్పుడు మేడ్చల్ జిల్లా స్థాయి బాధ్యత వరకు చేరింది. ఈ పరిణామం వెనుక పార్టీ పట్ల ఆయన చూపిన విధేయతతో పాటు, క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం కూడా కీలకంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఇప్పుడు జిల్లా స్థాయిలో పార్టీ కార్యక్రమాలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఓబీసీ మోర్చా బాధ్యతలు రావడంతో వెనుకబడిన వర్గాల సమస్యలు, వారి రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ అంశాలను పార్టీ వేదికగా మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆయనపై పడింది.

**ఓబీసీ మోర్చా బాధ్యతతో పెరిగిన బాధ్యత**
మేడ్చల్ జిల్లాలో ఓబీసీ వర్గాలను పార్టీతో మరింత అనుసంధానం చేయడం, క్షేత్రస్థాయిలో ఓబీసీ కార్యకర్తలను సమన్వయం చేయడం, వారి సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాల్లో కొత్తగా నియమితులైన జిల్లా సెక్రెటరీగా రాంపల్లి యాదగిరి గౌడ్‌కు కీలక బాధ్యతలు ఉండనున్నాయి. ఇప్పటివరకు స్థానిక స్థాయిలో ప్రజలతో ఉన్న అనుబంధాన్ని జిల్లా స్థాయికి విస్తరించాల్సిన అవసరం కూడా ఆయన ముందుంది. పార్టీ బలోపేతంతో పాటు ఓబీసీ మోర్చాను గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిల్లో మరింత క్రియాశీలం చేయడం ఆయనకు ప్రధాన సవాలుగా మారనుంది.

**"నాపై నమ్మకం ఉంచిన నాయకత్వానికి కృతజ్ఞతలు"**
కొత్త బాధ్యతలు దక్కిన సందర్భంగా రాంపల్లి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, ముఖ్యంగా ఓబీసీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు వై. మహేందర్ యాదవ్‌తో పాటు సుజాత నాయుడు, సుగుణ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ గోనె శ్రీనివాస్, లక్ష్మి, అమర్ మోహన్ రెడ్డి మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ.. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తానని, ఓబీసీ వర్గాల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాంపల్లి యాదగిరి గౌడ్‌కు జిల్లా స్థాయి బాధ్యతలు దక్కడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుచరులు శుభాకాంక్షలు తెలిపారు.

# డ్రైనేజీ మురుగు నీటిలో మంచి నీరు కలిసితం

**కాలనీవాసులకు కలుషిత నీటితో అంటువ్యాధులు ప్రబలించే ప్రమాదం**



**నర్వ, 31 ఆగష్టు**
మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురుగునీరు పారే డ్రైనేజీ కాలువలో గతంలో తాగునీరు కులాయి మంచినీటి పైపులైను డ్రైనేజీ కాల్వలో నుండి కొళాయి కనెక్షన్ ఇవ్వడం తో అట్టి పైపులైన్ మధ్యలో విరిగిపోవడంతో డ్రైనేజీ కాలువలో పారే మురుగునీరు ప్రజలు త్రాగే మంచినీటి వాటర్ రెండు ఒకే దాంట్లో వెళ్లడంతో ప్రజలకు మలేరియా డెంగు టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రభవిస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు . ఇట్టి విషయాన్నిఅధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదని చూసి చూడనట్టు ప్రవర్తిస్తున్నారని అన్నారు.గత రెండు సంవత్సరాలుగా ఇదే తంతు జరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ యొక్క కుళాయి కనెక్షన్ ఆశా వర్కర్ ఇంటికి సంబంధించిన కనెక్షన్ కావడంతో అట్టి ఆశా వర్కర్ కుచుట్టు ప్రక్కల ఉండే ప్రజలకు సంక్రమించే ప్రమాదం ఉందని తెలుపుతున్నారు ఆశా వర్కర్ ఇంటి కులాయి కి వెళ్లే పైపులు ఈ సమస్యను సరి చేసుకో అని కాలనీవాసులు తెలపగా ఈ యొక్క సమస్య నాకు సంబంధం లేదు గ్రామంలో ఉండే గ్రామ సర్పంచ్ కు గ్రామ పంచాయితీకి సంబంధం నాకు ఎటువంటి సంబంధం లేదని ఆశా వర్కర్ బదులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఒక ఆశా వర్కర్ ఉండి ప్రజలకు ఇలాంటి సమస్యలపై వివరించేది పోయి చెప్పిన ప్రజలపై దౌర్జన్యాన్నికి పాల్పడడం జరుగుతుందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ సెక్రెటరీ బుచ్చిరెడ్డిని వివరణ కోరగా ఈ యొక్క కనెక్షన్ గతంలో పందుల భారీ నుండి విరిగిపోవడం జరిగిందని తెలిపారు ఈ యొక్క సమస్య ఆశ వర్కర్లైన నారాయణమ్మ తన యొక్క కులాయి కనెక్షన్ కాబట్టి ఆ యొక్క పైపులైను తాను సరి చేసుకోవాలనిఎన్నోసార్లు తెలియజేసిన సరి చేసుకోవడం లేదని తెలియజేశారు. ఆశా వర్కర్ నారాయణమ్మ ఇట్టి పైపులను సరి చేసుకొని యెడల ఈ యొక్క కనెక్షన్ ను సిల్ చేయడం జరుగుతుందని అన్నారు.

# ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం:

- రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా
- స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి







**ఖమ్మం/ ఆగస్టు 31/(పీపుల్స్ న్యూస్ )**
సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, తనకు ప్రజాశ్రేయస్సే ముఖ్యమని, తాను ఎప్పుడూ పదవులను ఆశించలేదని, కేవలం ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవసరమైన విద్యా, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురేఖల ం మారుస్తామని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా, తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ అంగీకరిస్తే 100 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా రోడ్ల వెడల్పు, అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి అన్నారు.ఖమ్మం పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రూ. 250 కోట్లు మంజూరు చేశారన్నారు. పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, 24 గంటల పాటు మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ కేసులకు తావులేకుండా శాంతిభద్రతలను కాపాడాలన్నారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడాలని, అయితే ఎలాంటి తప్పు చేయని అమాయకులు, పేద ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని, వాటిని సక్రమంగా నిర్వహించి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఖమ్మం ప్రజలపైనే ఉందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం ముని సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌తో ఎరువుల బుకింగ్ సులభం : మండల వ్యవసాయ అధికారి డాక్టర్ దాసరి నవ్య

**- 48 గంటల్లో ఎరువులు పొందే అవకాశం.. అన్ని కేటగిరీల రైతులకు అవకాశం**

**మంథని, 31 ఆగస్టు**
: ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సులభతరం చేసేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన అన్ని రకాల ఎరువులను ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని మంథని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ దాసరి నవ్య తెలిపారు. నమోదు చేసుకున్న రైతులకు 48 గంటల్లో ఎరువులు అందేలా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టాదారు రైతులతో పాటు మరణించిన పట్టాదారుల వారసత్వం నమోదు కాని భూములను సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు, అటవీ హక్కుల పట్టాలు కలిగిన వారు, పోడు భూములు, దేవాదాయ శాఖ భూములు, ప్రభుత్వ, సంస్థలు, సామాజిక భూములు సాగు చేస్తున్న రైతులు కూడా ఈ విధానం ద్వారా ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఆధార్, ఫోన్ నంబర్ ధ్రువీకరణ అనంతరం భూమి వివరాలు నమోదు చేసేటప్పుడు సంబంధిత కేటగిరీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లో భూమి ఉన్న రైతులు, చట్టపరమైన వారసులు, యజమానులుగా ఉండి భూమి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నవీకరించబడని రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. భూమి వివరాలు నమోదు కాని రైతులు 'భూమిని జోడించు' ఎంపిక ద్వారా సాగు చేస్తున్న భూమి సర్వే నంబర్, విస్తీర్ణాన్ని నమోదు చేస్తే సంబంధిత వ్యవసాయ అధికారి పరిశీలనకు వెళ్తుందని తెలిపారు. అధికారి ఆమోదం పొందిన తర్వాత ఎరువులను నమోదు చేసుకుని పొందవచ్చన్నారు. రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువులు నమోదు చేసుకోవడంలో ఇబ్బందులు లేకుండా వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎరువుల విక్రయదారులు సహకరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, రైతులు ఎరువుల లభ్యతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ దాసరి నవ్య పేర్కొన్నారు.

# గడుపులోగా సిసి బెడ్డు పనులు పూర్తి చేయాలి.

**చైర్మన్ అక్కిశ్రీనివాస్ గౌడ్**

**పెబ్బేరు,ఆగస్టు 31**మున్సిపల్ కేంద్రాలోని ఆర్టీసీ బస్ స్టాండ్ ఆవరణలో చేపడుతున్న సీసీ బెడ్డు నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీసీ బెడ్డు నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిమెంట్,కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించాలని కాంట్రాక్టర్ కృష్ణకుమార్ రెడ్డిని ఆదేశించారు.బస్ స్టాండ్ లోకి బస్సుల రాకపోకలకు, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని,నిర్ణీత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బస్ స్టాండ్ అభివృద్ధికి మున్సిపాలిటీ కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి,కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ

**పోలీసు అధికారుల సేవలను గుర్తుచేసుకుంటూ ఘనంగా సన్మానించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్**













**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న ఐదుగురు పోలీసు అధికారులకు సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న అధికారులను సీపీ డా. ఎం. రమేష్ సన్మానించారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐ ఎం. రవీందర్ రెడ్డి (కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్), ఎస్ఐ పి. విజయ్ భాస్కర్ రెడ్డి (ఎస్‌బీ, సైబరాబాద్), ఆర్ఎస్ఐ ఫరీద్ ఖాన్ (సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్), ఏఎస్ఐ టి. కేశవులు (అత్తాపూర్), హెచ్‌జీ ఏబీ శర్మ (బాలానగర్ ట్రాఫిక్) ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన అధికారులు పదవీ విరమ ణ పొందడం వారి జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని అన్నారు. విధి నిర్వహణలో అధికారులు అందించిన సేవలు, అనుభవం పోలీసు శాఖకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పోలీసు అధికారులు తమ విధులను ప్రశాంతంగా, సమర్థవం తంగా నిర్వహించడంలో వారి సహధర్మచారులు, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని సీపీ అన్నారు. కుటుంబ సభ్యుల మద్దతు లేకుండా పోలీసు ఉద్యోగ బాధ్యతలను సమం వంతంగా నిర్వహించడం కష్టమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధు వులతో ఆనందంగా సమయం గడపాలని సీపీ సూచించారు. ఖాళీగా ఉండకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజానికి తమ వంతు సేవ చేయాలని కోరారు. హైదరాబాద్ నగరం, సైబరాబాద్ ప్రాంత అభివృద్ధిలో పోలీసు శాఖ కూడా కీలక పాత్ర పోషించిందని, ఆ అభివృద్ధిలో భాగస్వా ములైన పోలీసు అధికారులు గర్వపడాలని అన్నా రు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి లభించే రిటైర్మెంట్ ప్రయోజనాలు, ఆర్థిక వనరులను జాగ్రత్తగా వినియోగి ంచుకోవాలని సీపీ సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉం డాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. పోలీసు శాఖకు అవసరమైన సందర్భాల్లో పదవీ విరమణ పొందిన అధికారులు తమ అను భవం, సూచనలతో శాఖకు సహకరించాలని సీపీ కోరారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఐదుగురు అధికారులను సీపీ ఘనంగా సన్మానించి, వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డీసీపీ షమీర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓబీసీ సెల్ నూతన కమిటీలకు దరఖాస్తుల ఆహ్వానం...!

**డిసిసి అధ్యక్షులు లాకవత్ ధనవంతి లక్ష్మీనారాయణ నాయక్...!!**



**జనగామ, ఆగస్టు 31**
జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో... ఓబీసీ సెల్ నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 3వ తేదీన ప్రారంభం కానుంది. జిల్లా, అసెంబ్లీ, డివిజన్, మండల, టౌన్ మరియు గ్రామ స్థాయిలలో ఛైర్మెన్ మరియు కమిటీ సభ్యుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జనగామ డీసీసీ కార్యాలయంలో సమర్పించాలని డిసిసి అధ్యక్షులు లాకవత్ ధనవంతి లక్ష్మీనారాయణ నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే అనుభవం, ఆసక్తి, నిబద్ధత మరియు క్రమశిక్షణ కలిగిన నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ సెల్ అబ్జర్వర్లు తిరుపతి, రవీందర్, బాలు యాదవ్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల మల్లేష్, జనగామ పట్టణ అధ్యక్షుడు ధోర్నాల వెంకటేశ్వర్లు, ఓబీసీ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ చింతకింది మల్లేష్, కర్రే రాజశేఖర్, జాయ మల్లేష్, ఎదునూరి రవీందర్, మచ్చ ప్రవీణ్, కళ్యాణం సమ్మయ్య అలీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపురం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బండ్ల ఉమా చారి...!

**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 31**



జనగామ జిల్లా బచ్చున్నపేట మండలం నారాయణపురం గ్రామంలో... కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ... పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో బండ్ల ఉమా చారి... కీలకంగా కృషి చేశారని కార్యకర్తలు తెలిపారు. ఆయన పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందించారు. ఆయన సేవలను గుర్తించిన కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల ఉమా చారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్న పార్టీ కార్య కర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరిదే స్వప్న శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ మసూద్, జిల్లా నాయకులు దాత్రపు నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు హరీష్, గుర్రపు బాలరాజు, జంగిటి నరేష్ , బొట్టు గణపతి పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**రాజాపేట ఆగస్టు 31**




రాజపేటలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 8.9.10. తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే. ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మాట్లాడుతూ మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రైవేటు కాంట్రాక్టు రంగంలో పనిచేస్తున్న యువకులకు కనీస వేతనం భద్రత సామాజిక భద్రత కల్పించాలని కోరారు రాబోయే రోజులలో యువత సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి మూల పోచయ్య దయ్యాలసిద్ధులు కొయ్య బాబు బొద్దుల మహేష్ తరిగొప్పుల సిద్దు లు నాగారం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పసిపిల్లల కుటుంబాన్నిపరామర్శించిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు







**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 31( పీపుల్స్ న్యూస్)**
చెరువులో ప్రమాదవశాత్తు మరణించిన బాలాల కుటుంబాలను ఓదార్చిన ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ములుగు జిల్లా ములుగు మండలంలో గణేష్ లాల్ గ్రామంలోని తల్లి ఇంటికి రాఖీ కట్టడానికి మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మాలోతు స్వాతి యాకూబ్ తన పుట్టింటికి వెళ్ళిన సందర్భంగా చెరువులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించిన మాలోత్ వినయ్ రాజేష్ విషాదకర ఘటనలో అన్నదమ్ములు మృతి చెందిన విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు బాధిత మాలోత్ స్వాతి యాకూబ్ కుటుంబాన్ని పరామర్శించారు

## చిక్కడపల్లిలో ఈశ్వరప్ప హోమియోపతి ఆసుపత్రి ప్రారంభం

**హైదరాబాద్ : ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**





–హైదరాబాద్ చిక్కడపల్లి ప్రాంతంలో ఈశ్వరప్ప హోమియోపతి ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ గడ్డం శ్రీనివాస్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అధిపతి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దండేపు బస్వానందం దంపతులను డాక్టర్ గడ్డం శ్రీనివాస్ దంపతులు సన్మానించారు. అనంతరం ఆసుపత్రి సేవలు, అందుబాటులో ఉండే వైద్య విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన హోమియోపతి వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి ప్రారంభించడం అభినందనీయమని డాక్టర్ గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు, వైద్య రంగానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

# పహాడీషరీఫ్‌లో యువ నర్సు హత్యాచారం

**- 30 గంటల్లో నిందితుడి అరెస్ట్..**

**సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన పోలీసులు**




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 31( పీపుల్స్ న్యూస్)**
పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 ఏళ్ల యువ నర్సు హత్య, అత్యాచారం కేసును పోలీసులు ఛేదించారు. ఘటనపై ఫిర్యాదు అందిన సుమారు 30 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసినట్లు శంషాబాద్ జోన్ పోలీసులు సోమవారం వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్న 21 ఏళ్ల యువతి ఆసుపత్రి క్వార్టర్స్‌లో నివాసముంటోంది. ఈ క్రమంలో ఆగస్టు 29న మధ్యాహ్నం ఆమె గదిలో నుంచి బయటకు రాకపోవడంతో తోటి నర్సు కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కిటికీ ద్వారా గదిలోకి చూడగా యువతి రక్తగాయాలతో మృతి చెంది కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న నిందితుడుదర్యాప్తులో సాంకేతిక ఆధారాలు, ఇతర కీలక సమాచారాన్ని సేకరించిన పోలీసులు తుక్కుగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న లిఎండీ సనావుల్లా (34)లిను నిందితుడిగా గుర్తించారు. బీహార్ రాష్ట్రం బెగూసరాయ్ జిల్లా బచ్‌వారా ప్రాంతానికి చెందిన సనావుల్లా కొంతకాలంగా హైదరాబాద్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నిందితుడు మృతురాలి కదలికలను కొంతకాలంగా గమనిస్తూ, ఆమెపై లైంగిక దాడికి పాల్పడేందుకు పథకం వేసుకున్నాడు. ఆగస్టు 28–29 మధ్య అర్ధరాత్రి ఆమె గదిలోకి కిటికీ ద్వారా ప్రవేశించాడు. మృతురాలు ప్రతిఘటించి కేకలు వేయడంతో ఆమెను అడ్డుకునే ప్రయత్నంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆమె నిందితుడి చేతిని కొరకడంతో పాటు గోళ్లతో గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు యువతిపై దాడి చేసి, గొంతు నులిమి హత్య చేసిన అనంతరం అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కిటికీని మూసివేసి అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. సాంకేతిక ఆధారాలతో అరెస్ట్కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి విశ్లేషించారు. వాటి ఆధారంగా నిందితుడిని గుర్తించి ఆగస్టు 30 సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఒక శామ్‌సంగ్ మొబైల్ ఫోన్, నిందితుడు ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై క్రైమ్ నంబర్ 554/2026 కింద దీమీా సెక్షన్లు లి103(1), 64(1), 332(ఖ)లితో పాటు రాజ/రూ (అట్రాసిటీస్ నిరోధక) చట్టం, 1989లోని సెక్షన్ 3(అఅ)(ఎ) కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్ పర్యవేక్షణలో శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్, ఆర్‌జీఐఏ డివిజన్ ఏసీపీ వి. శ్రీకాంత్ గౌడ్ మార్గదర్శకత్వంలో పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీనారాయణ రెడ్డి, పోలీసు బృందం, శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి ఈ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారుకేసుకు సంబంధించిన మరిన్ని శాస్త్రీయ, సాంకేతిక ఆధారాల సేకరణ, విశ్లేషణ కొనసాగుతున్నట్లు శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయం వెల్లడించింది.

## జీవితకాల సాఫల్య పురస్కారాలతో ముగ్గురు ఉన్నతాధికారులకు సత్కారం




**ఆంధ్రప్రదేశ్ : ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ చేతుల మీదుగా ముగ్గురు ఉన్నతాధికారులకు ప్రతిష్టాత్మక లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు. డెహ్రాడూన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ×ఖీూ అధికారి సమీర్ సిన్హా, కర్ణాటకకు చెందిన ×ఖీూ అధికారి మీనాక్షి నేగి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ×ూూ అధికారి అంజనీ కుమార్ ఈ పురస్కారాలను అందుకున్నారు. ప్రభుత్వ సేవల్లో విశేషంగా అందించిన సేవలు, వృత్తిపరమైన నిబద్ధత, ప్రజాసేవలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ జీవితకాల సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ గుర్మీత్ సింగ్ మాట్లాడుతూ ప్రజాసేవలో దీర్ఘకాలంగా అంకితభావంతో పనిచేసిన అధికారుల సేవలను అభినందించారు. అవార్డులు అందుకున్న అధికారులు తమ సేవలకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 12పై ఏ.డి. సర్వేతో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి



Cell : 9440901313
9849273184

BHARATIYA JANATA PARTY
45-Quthbullapur Assembly Constituency
Flat No. 205, Ushodaya Towers, Shapur Nagar, IDA Jeedimetla, Hyderabad-500 055.TS

Date : 31/08/2026

వినతి పత్రం

శ్రీయుత గౌరవనీయులైన కుత్బుల్లాపూర్ తాసిల్దార్ గారికి,

విషయము:- కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్లో గల సర్వే నంబర్ 12 లో జరుగుతున్న కబ్జాలను మీ దృష్టికి అనేకమార్లు తీసుకొని వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అయ్యా...!

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ కి సంబంధించి సర్వేనెంబర్ 12 సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అయిందని గతంలో అనేకమార్లు గౌరవ తాసిల్దార్ గారికి వినతిపత్రం రూపంలో ఇవ్వడం జరిగింది.

అనగా 16-07-2025 మరియు 23-08-2025 ఇప్పటికే వినతి పత్రాలు ఇచ్చి సంవత్సరం గడుస్తుంది కానీ అన్యాక్రాంతమైన స్థలంలో వినతి పత్రాలు ఇచ్చిన తర్వాత కొత్త కొత్త నిర్మాణాలు లాంటివి ఎన్నో జరిగాయి. కానీ కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడవలసిన రెవెన్యూ అధికారులే నిమ్మకు నీరుతున్నట్టుగా చూస్తూ ఉండిపోయారు.

మరి కబ్జాదారుడికి అధికారులకు మధ్యలో ఉన్న బంధం సంబంధం ఏమిటో మీరు చెప్తారా లేక...., ఈ సర్వే నంబర్ లో కబ్జా జరిగింది అని సుమారు నాలుగు సంవత్సరాల క్రితం అప్పుడున్న తాసిల్దార్ గారికి వినతిపత్రం రూపంలో ఇవ్వడం జరిగింది.

Office of the Tahsildhar
31 AUG 2026
Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist.



Cell : 9440901313
9849273184

BHARATIYA JANATA PARTY
45-Quthbullapur Assembly Constituency
Flat No. 205, Ushodaya Towers, Shapur Nagar, IDA Jeedimetla, Hyderabad-500 055.TS

Date : 31/08/2026

వినతి పత్రం

శ్రీయుత గౌరవనీయులైన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గారికి.

విషయం:- స్పీడ్ బ్రేకర్స్

అయ్యా....!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 278 డివిజన్ లోని చిత్తరమ్మ ఆలయం వద్ద గల యూటర్న్ దగ్గర షాపూర్ నుంచి గాజులరామారం వచ్చే దారిలో మరియు గాజులరామారం విలేజ్ నుంచి షాపూర్ వైపు వెళ్లే దారిలో ఆలయం వద్ద స్పీడ్ బ్రేకర్ ను తక్షణమే నిర్మించండి.

అది స్కూల్ జోన్ కావున ఉదయం సమయంలో మరియు సాయంకాలం సమయంలో అతివేగంగా వస్తున్న వాహనాల వల్ల స్కూల్ పిల్లలు మరియు పేరెంట్స్ రోడ్డు క్రాస్ చేసి పిల్లలను స్కూల్లో వదిలి పెట్టడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ముఖ్యంగా షేరింగ్ ఆటో వాళ్లు చాలా స్పీడ్ గా వాహనాలను నడుపుతూ చిన్న పిల్లలని కూడా చూడకుండా వెళ్తున్నారు కావున మీరు చరవ తీసుకొని సంబంధిత సిబ్బందితో చర్చించి ఈ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు సహకరిస్తారని మనవి.

ఇట్లు

సాయినాథ్ నేత

ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షులు

9966110209



**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 278 గాజులరామారం డివిజన్ పరిధిలోని పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు వినతిపత్రాలు సమర్పించారు. ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చిత్తరమ్మ ఆలయం సమీపంలోని యూటర్న్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో పాటు, ఆలయం ఎదురుగా కాకతీయ టెక్నో స్కూల్ సమీపంలోని రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ +జవీజ గాజులరామారం సర్కిల్ డీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. అదేవిధంగా బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వేణి ఎంక్లేవ్ నుంచి చిత్తరమ్మ ఆలయం సమీపంలోని యూటర్న్ వరకు వందలాది వాహనాలు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నాయని, దీనివల్ల ప్రమాదాల ముప్పుతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో పాటు రాంగ్ రూట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



**సర్వే నంబర్ 12లో నాలుగు ఎకరాలపై చర్యలు తీసుకోవాలి**
కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వే నంబర్ 12లో వందల కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమికి సంబంధించి మరోసారి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై గతంలో 16-07-2025, 23-08-2025 తేదీల్లో వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. సర్వే నంబర్ 12పై రెండు రోజుల్లోగా ఏ.డి. సర్వే నిర్వహించి భూమి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిర్ణీత గడువులో సర్వే నిర్వహించకపోతే గాజులరామారం సర్కిల్‌లో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దీజీవీ రాష్ట్ర నాయకురాలు రేవతి రాఘవులు, ఉమ్మడి డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ నేత, సీనియర్ నాయకులు శారద, సామంతుల శ్రీనివాస్ పటేల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఎస్ఐ లకు ఘనంగా వీడ్కోలు



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 31 (పీపుల్స్ న్యూస్)**
పోలీస్ కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సారమల్లు, ములుగు పీఎస్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఇమ్మాన్యుయేల్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సదానందం శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. “పోలీస్ రిటైర్మెంట్ కేవలం వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదు, ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించవచ్చు” అని అన్నారు. అనంతరం ములుగు సీఐ సురేష్, ఆర్ఐ స్వామి, డీఎస్పీలు రవీందర్, కిషోర్ కుమార్ మాట్లాడుతూ 42 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ లో ఇద్దరు అధికారులు నక్సలిజం తీవ్రంగా ఉన్న రోజుల్లో ఎంతో కష్టపడి పనిచేశారని కొనియాడారు. పండగల్లో కూడా కుటుంబానికి దూరంగా విధులు నిర్వర్తించారని, శేష జీవితం కుటుంబంతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రాంతి కుమార్, ఆర్ఐ వెంకటనారాయణ, పదవీ విరమణ అధికారుల కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా కరాటే పోటీల్లో రామగుండం విద్యార్థుల సత్తా

- హుజురాబాద్‌లో నిర్వహించిన డబ్ల్యూ.ఎఫ్.ఎస్.కె.ఓ టోర్నమెంట్‌లో పతకాల పంట
- విజేతలకు, కోచ్ శ్రీనివాస్‌కు అభినందనల వెల్లువ

**రామగుండం (ఎన్టీపీసీ),ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
హుజురాబాద్‌లోని బీఎస్ఆర్ గార్డెన్స్‌లో డబ్ల్యూ.ఎఫ్.ఎస్.కె.ఓ (ఔఖీూఖూ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ‘సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026’లో రామగుండం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరైన ఈ టోర్నమెంట్‌లో, పెద్దపల్లి జిల్లా రామగుండానికి చెందిన ‘జపాన్ షిటోరియో కరాటే స్కూల్’ విద్యార్థులు కటాస్, కుమితి విభాగాల్లో పోటీపడి పలు బంగారు, వెండి, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు.

పతకాల వివరాలు:

బ్లాక్ బెల్ట్ విభాగం:



లికటాస్: కీర్తి మహాజీ (బంగారు పతకం)

కుమితి: ఎం. కార్తికేయన్ (బంగారు పతకం), కీర్తి మహాజీ (వెండి పతకం)

కలర్ బెల్ట్ విభాగం:

కటాస్: శివన్య (వెండి పతకం), పి. వీర (వెండి పతకం), నిహాల్ నందన్ (కాంస్య పతకం)

కుమితి: శివన్య (బంగారు పతకం), పి. వీర (వెండి పతకం), నిహాల్ నందన్ (కాంస్య పతకం)

ఘనంగా అభినందనలు:
పోటీల్లో రాణించి పతకాలు సాధించిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ అధ్యక్షుడు ఎం. రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ పటేల్, బి. పరమేష్, నిదిష్ కుమార్, రోహిత్ కుమార్, సంజన, శుభశ్రీ, ఎం. ముక్తిశ్రీ, స్నేహ సుల్తానా, హేమలత మహాజీ, అభిజ్ఞ, ఏ. శ్రవణ్ కుమార్‌లతో పాటు స్పందన క్లబ్ కార్యదర్శి డాక్టర్ కె. నరేంద్ర సోనీ, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీరామ్, చిరంజీవి ఆదిత్య, వంశీకృష్ణ, గణేష్ రాజ్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రామగుండం విద్యార్థులు మరిన్ని పతకాలు సాధించి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

●ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..
●రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బోయినపల్లి సిఖ్ రోడ్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజ్‌గిరి, తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు ఆధ్వర్యంలో త్రిముల్‌ఘేరి పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. సర్దార్ నాయక్, ట్రాఫిక్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. జయకిషన్‌లతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ జి. శంకర్ రాజు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, చిన్న వయస్సు నుంచే విద్యార్థులు సురక్షితమైన రహదారి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించడం లో విద్యార్థులు కీలక పాత్ర పోషించగలరని ఏసీపీ పేర్కొన్నారు. విద్యార్థులు తాము ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు కూడా నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, రహదారిపై బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి సురక్షితమైన అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతకు రాయబారులుగా వ్యవహరించాలని, తాము నేర్చుకున్న విషయాలను తమ కుటుంబాలు, సమాజంలోకి తీసుకెళ్లాలని ఏసీపీ పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలపై చిన్న వయస్సు నుంచే అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో సురక్షితమైన ట్రాఫిక్ వాతావరణాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విలువైన మార్గదర్శకత్వం అందించిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాల తరఫున నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# ఎన్టీపీసీలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ప్రారంభం

-- ఎరువుల విక్రయాల్లో పారదర్శకతకే నూతన విధానం
-- రైతులు ఫార్మర్ ఐడీ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారుల సూచన




**రామగుండం : ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
రామగుండం మండలంలో ఎరువుల విక్రయాలను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన 'ఎఫ్ఎఫ్ఎస్' (ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్) యాప్‌ను సోమవారం ప్రారంభించారు. రైతులకు ఎరువుల పంపిణీలో నల్లబజారును అరికట్టి, పూర్తి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ఈ నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ యాప్ ద్వారా ఎరువులు పొందేందుకు రైతులు తమ ఫార్మర్ ఐడీతో పాటు ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ధృవీకరణ, పంట వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఎరువుల డీలర్లు రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, క్యూఆర్ కోడ్ లేదా టోకెన్ విధానం ద్వారా పంపిణీ చేపడతారు. ఈ విధానంతో అర్హులైన ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు సక్రమంగా అందుతాయని, ఎటువంటి అక్రమాలకు తావు ఉండదని అధికారులు వెల్లడించారు. మండలంలోని రైతులందరూ తమ ఫార్మర్ ఐడీలను సిద్ధంగా ఉంచుకుని, ఈ ఎఫ్ఎఫ్ఎస్ యాప్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

●రూ.10 వేల జరిమానా..
బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం



పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఎల్‌బీ నగర్‌లోని రంగారెడ్డి జిల్లా రేప్, పోక్సో కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. నిందితుడికి రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.1 లక్ష నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 723/2023కు సంబంధించి ఎస్సీ నంబర్ 180/2024గా కేసు విచారణ జరిగింది. 2023 డిసెంబర్ 16న 16 ఏళ్ల బాలిక కనిపించకుండా పోవడంతో ఆమె తల్లి డిసెంబర్ 18న పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం బాలికను సురక్షితంగా గుర్తించారు. దర్యాప్తులో బాలికకు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న నిందితుడితో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. సమగ్ర దర్యాప్తు అనంతరం నిందితుడిపై ఛాజ సెక్షన్లు 376(2)(అ), 366తో పాటు పోక్సో చట్టం-2012లోని సెక్షన్లు 5(శ్రీ), 6 కింద అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.1 లక్ష నష్టపరిహారం అందించాలని ఆదేశించింది.

**దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులు**
కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు బి. శ్రీనివాస్, అప్పటి ఏసీపీ మహేశ్వరం (ప్రస్తుతం డీఎస్పీ, నాగర్‌కర్నూల్), పి. లక్ష్మీకాంత్ రెడ్డి, అప్పటి ఏసీపీ మహేశ్వరం (ప్రస్తుతం డీఎస్పీ, ఏసీబీ, హైదరాబాద్)లను పోలీసు అధికారులు అభినందించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి. సత్యనారాయణ, కృష్ణ ప్రసన్న కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఇ. వెంకటేష్ (హెచ్‌సీ 4044), సమ్మన్స్, వారెంట్ ఎగ్జిక్యూషన్ టీమ్‌కు చెందిన నరసింహ (పీసీ 11601), ఎస్. శ్రీరాములు (హెచ్‌సీ 2887), జి. రవీందర్ (హెచ్‌సీ 3747), లైజన్ ఆఫీసర్లు రమేష్ (ఎస్ఐపీ, విమెన్ సేఫ్టీ వింగ్), వివేక్ వర్ధన్ రెడ్డి (హెచ్‌సీ 2851, ఆర్‌జీఐఏ డివిజన్) కేసు దర్యాప్తు, కోర్టు ప్రక్రియలో సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీనారాయణ రెడ్డి అభినందించారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- మంగపేట మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం

**మంగపేట ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 31 (పీపుల్స్ న్యూస్)**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో చర్చకు తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పిలుపు మేరకు మంగపేట మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంగపేట మండల పార్టీ మాజీ అధ్యక్షులు కుడు ముల లక్ష్మీ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో కుడుముల లక్ష్మీ నారాయణ వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని కుడుముల లక్ష్మీ నారాయణ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన తీరును ప్రజలకు వివరించి, ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ప్రజల సమస్యలు ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల తరఫున ప్రశ్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, జిల్లా సీనియర్ నాయకులు, చిలకమర్రి రాజేందర్, పప్పు వెంకట రెడ్డి, చీకుర్తి సుధాకర్, చల్లగురుగుల తిరుపతి, యాదండ్ల రాజయ్య, దంతనపల్లి నరేందర్, అయూబ్, ఇంతేహాస్ భూట్టు, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు, నూనె లింగయ్య, ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, రావుల రమణ, రొడ్డ సుదర్శన్, శ్రీను, పి ఎ సి ఎస్ డైరెక్టర్ అచ్చ సత్యనారాయణ, మండల మహిళా మాజీ అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మి, కాటూరి సుగుణ, మహిళలు, జెట్టి లక్ష్మి, యూత్ నాయకులు, కేక్కం జగదీష్, జవ్వంగుల రవి, భాస్కర్, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి, కుమార్ స్వామి, జాడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు,

# ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగులకు ఘన వీడ్కోలు














**రామగుండం, ఎన్టీపీసీ,ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**
ఎన్టీపీసీ రామగుండం ఓ తెలంగాణ సంస్థలో సుదీర్ఘ కాలంగా సేవలు అందించి సోమవారం పదవీ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులకు యాజమాన్యం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించింది. సంస్థ పురోగతికి వారు అందించిన అంకితభావంతో కూడిన సేవలను ఈ సందర్భంగా అధికారులు, తోటి ఉద్యోగులు కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో వుడుతల గిరి (సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ -- మెకానికల్ మెయింటెనెన్స్), అరెండల వెంకటేశ్వర్లు (ఇంజనీర్ -- ఎస్-ఎల్‌పీఎస్ ఆపరేషన్), ముత్యం రాజన్న (ఇంజనీర్ -- ఎస్ఎల్‌పీఎస్ ఫ్యూయల్ హ్యాండ్లింగ్ ఆపరేషన్), మేకల రామస్వామి (సీనియర్ మజ్దూర్ -- ఆపరేషన్) ఉన్నారు. సంస్థ అభివృద్ధిలో వీరు పోషించిన పాత్రను స్మరించుకుంటూ, ఎన్టీపీసీ రామగుండం ఓ తెలంగాణ కుటుంబం తరఫున వారికి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణతో కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న వీరంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ఆరోగ్యంగా, సంతృప్తికరమైన శేష జీవితాన్ని గడపాలని ఎన్టీపీసీ యాజమాన్యం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. జీపు బోల్తా పడి నలుగురు దుర్మరణం..!




**కుభీర్, ఆగస్టు 31:** నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి బీ గ్రామానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తీర్థయాత్రకు వెళ్లిన వీరు సోమవారం మహారాష్ట్రలోని తొటంబ వద్ద జీపు బోల్తా పడిన ఘటనలో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతులను జీపు డ్రైవర్ తులసిరాం (29), పార్డీఖబి గ్రామానికి చెందిన డ్రైవర్ తులసిరాం పటేల్ (28), తూము సాయిలు (65), ఆవుల గంగాధర్ (64), తూమ్(పుల్లికోల్ల) గౌరబాయి(75)లుగా గుర్తించారు. తొటంబ ప్రమాదం జరిగిన సమయంలో జీపులో 14 మంది ప్రయాణిస్తున్నారు. జీపు బోల్తా పడి నలుగురు మరణించగా. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా వీరిలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఏడుగురిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. దైవదర్శనానికి వెళ్లి.. నలుగురు మృత్యువాత పడడంతో పార్డి బీ గ్రామంలో విషాదం నెలకొంది.

## పిల్లలు పుట్టాక "భార్యాభర్తల" మధ్య ప్రేమ తగ్గుతోందా? - ఈ టిప్స్ పాటిస్తే మంచిదంటున్న నిపుణులు!



సాధారణంగా పిల్లలు పుట్టిన తర్వాత భార్యాభర్తల మధ్య ప్రేమ తగ్గడం, దూరం పెరగడం కొంతమంది విషయంలో చూస్తుంటాం. ఎందుకంటే ఈ సమయంలో వారి ఆలోచనలు మొత్తం పిల్లల పైనే ఉంటాయి. ఈ కారణంతో కొన్నిసార్లు ఒకరినొకరు అశ్రద్ధ చేయవచ్చు. కానీ, ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే దాంపత్య బంధం దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, దంపతులు ఓ వైపు తమ చిన్నారిని ప్రేమగా చూసుకుంటూనే, మరోవైపు ఒకరితో ఒకరు ప్రేమగా మెలగడం ముఖ్యమంటున్నారు. అప్పుడే తమ అనుబంధాన్ని మరింత దృఢం చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ముగ్గురైనప్పుడు అదనంగా మరికొన్ని కొత్త బాధ్యతలు వచ్చిపడతాయంటున్నారు నిపుణులు. వీటిని ఇద్దరూ సమానంగా పంచుకోవాలని చెబుతున్నారు. ఎలాగంటే, భార్యే ఇంటి పనులు, పాపాయి అవసరాలు చూసుకోవాలంటే అన్ని సార్లు కుదరకపోవచ్చట. కాబట్టి, ఇంటి పనుల్లో ఒకరికొకరు సహాయం చేసుకోవడం లేదంటే ఒకరు ఇంటి పనులు చేస్తే.. మరొకరు బుజ్జాయిని ఎత్తుకోవడం, ఆడించడం వంటివి చేయాలని అంటున్నారు. ఇలా ఇద్దరూ ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగితే అటు పనులు పూర్తవడంతో పాటు, ఇటు దంపతుల మధ్య బంధమూ దృఢమవుతుందని తెలియజేస్తున్నారు. అలాగే, పాపాయికి ఏ లేకుండా జాగ్రత్తపడచ్చని సూచిస్తున్నారు.

ఆందోళన, ఒత్తిడితో సతమతమవుతున్నారా? – ఈ పని కోసం రోజూ కొన్ని నిమిషాలు కేటాయిస్తే చాలట!వీలున్నప్పుడల్లా : భార్యభర్తల మధ్య అన్యోన్యత పెరగాలంటే.. ఇద్దరూ కలిసి ప్రేమగా మాట్లాడుకోవడం కూడా ముఖ్యమంటున్నారు నిపుణులు. అయితే, పిల్లలు పుట్టిన తర్వాత ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా ఉంటాయంటున్నారు. ఎందుకంటే, పాపాయి ఆలనాపాలనా చూసుకోవడానికే సమయం సరిపోతుందని తెలియజేస్తున్నారు. కాబట్టి, బుజ్జాయి అవసరాలు తీరిన తర్వాత అంటే తను పడుకున్నప్పుడో, ఆడుకుంటున్నప్పుడో ఇద్దరూ కలిసి కాసేపు ప్రేమగా మాట్లాడుకోవడం, భవిష్యత్ ప్రణాళికల గురించి చర్చించుకోవడం వంటివి చేయాలని పేర్కొంటున్నారు. అలాగే, అప్పుడప్పుడూ డిన్నర్?కు, ఏవైనా ప్రదేశాలు చూడడానికి బయటికి వెళుతుండాలని తెలియజేస్తున్నారు.ఇంట్లోనే సరదాగా : పిల్లలు పుట్టిన తర్వాత ఇంట్లో పాపాయితో సరదాగా గడుపుతూ కూడా దంపతులు వారి బంధాన్ని మరింత పటిష్టం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో భార్యభర్తలిద్దరూ ఒకరికి ఇష్టమైన వంటకాలు మరొకరు తయారు చేసి సర్?ప్రైజ్ చేయడం, నచ్చిన సినిమాలు చూడడం, కాసేపు పాటలు వినడం వంటివి చేయాలని పేర్కొంటున్నారు. దీంతో భార్యభర్తల మధ్య బంధం బలపడడంతో పాటు ఇద్దరికీ రోజువారి ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం లభిస్తుందని తెలియజేస్తున్నారు. అలాగే, పెళ్లిరోజు, పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో కూడా ఎప్పటిలాగే ఒకరికొకరు నచ్చిన గిఫ్ట్??? ఇచ్చిపుచ్చుకోవడం, సరదాగా కాసేపు సమయం గడపడం వంటివి చేయడం మంచిదట.ఓ గంట బయటికెళ్లండి : ఇంట్లో పసిపిల్లలు ఉన్నప్పుడు దంపతులతో పాటు అమ్మ, అత్తమామలు ఇలా ఎవరో ఒకరు ఉంటారు. వాళ్లు ఉన్నప్పుడే భాగస్వామితో సమయం గడపడానికి సరైన అవకాశమని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో పాపాయి నిద్రపోయిన తర్వాత ఇద్దరు కలిసి బయటికి వెళ్లడం వంటివి చేయాలంటున్నారు. భార్యభర్తలు కలిసి అలా ఏకాంతంగా వెళ్లడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొంటున్నారు.

## ఫోన్ నీళ్లలో పడిందా? బియ్యంలో పెట్టే తప్పు అస్సలు చేయకండి.. ఈ 4 పనులు చేస్తే చాలు!





ఈ రోజుల్లో చాలా మంది తమ సెల్ ఫోన్‌లను బాత్రూమ్ వంటి ప్రదేశాలకు కూడా తీసుకువెళ్తున్నారు. లేదా వర్షాకాలంలో బైక్‌పై వస్తున్నప్పుడు సాధారణంగా వర్షపు నీటిలో తడుస్తుంటుంది. లేదా పొరపాటున నీటిలో పడిపోతుంటుంది. మీ సెల్ ఫోన్ తడిసిపోతే చేయకూడని తప్పులు, అనుసరించాల్సిన పద్ధతులు ఉన్నాయి. అప్పుడు మొబైల్ సేఫ్‌గా ఉంటుంది. లేకుండా పనికి రాకుండా పోతుందని గుర్తించుకోండి. అవేంటో తెలుసుకుందాం..ఈ తప్పులు చేయకండి:నోటితో ఊదడం: ఛార్జింగ్ పోర్ట్ లోపల ఉన్న నీటిని బయటకు తీయడానికి, మనం సాధారణంగా నోటితో గట్టిగా ఊదుతాము. ఇలా చేయడం తప్పు. మీరు ఇలా ఊదినప్పుడు గాలి పీడనం లోపల ఉన్న నీటిని మరింత లోపలికి నెట్టి, దానిని డిస్‌ప్లే, మదర్‌బోర్డ్‌లోకి చేరేలా చేస్తుంది.ఆల్కహాల్ లేదా రసాయనాలతో తుడవడం : ఆల్కహాల్ లేదా శానిటైజర్ నీటి కంటే వేగంగా ఆవిరైపోయినప్పటికీ అవి స్క్రీన్‌ను పూర్తిగా పాడుచేయగలవు. అంతేకాక ఫోన్ లోపల ఉండే అంటుకునే పదార్థాలను కూడా కరిగించగలవు. నేటి ఆధునిక ఫోన్‌లు ఞా67 లేదా ఞా68 సర్టిఫికేషన్ పొందిన వాటర్‌ప్రూఫ్ ఫోన్‌లుగా వస్తున్నాయి. దీని ఫలితంగా చాలా మంది తమ ఫోన్‌లు తడిచిన తర్వాత వాటిని తుడవకుండానే ఉపయోగిస్తారు. అయితే వర్షపు నీటిలోని ఆమ్లత్వం, లవణత్వం వంటి కారకాల వల్ల ఫోన్‌లోని స్పీకర్ గ్రిల్స్ నెమ్మదిగా పాడు చేయవచ్చు.మైక్రోవేవ్ ఓవెన్ లేదా ఎండకు..: ఫోన్‌ను ఆరబెట్టే నెపంతో కొంతమంది దానిని గంటల తరబడి మైక్రోవేవ్ ఓవెన్‌లో లేదా నేరుగా ఎండలో పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. మీరు దానిని ఓవెన్‌లో పెడితే మరుక్షణమే ఫోన్ పేలిపోతుంది. ఎండలో వదిలేస్తే స్మార్ట్‌ఫోన్‌లలోని లిథియం-అయాన్ బ్యాటరీలు అధిక వేడికి కరిగిపోతాయి లేదా శాశ్వతంగా దెబ్బతింటాయి.హెయిర్ డ్రైయర్‌తో ఆరబెట్టడం: హెయిర్ డ్రైయర్ నుండి వెలువడే తీవ్రమైన వేడి మీ స్మార్ట్‌ఫోన్‌లోని చిన్న ఎలక్ట్రానిక్ భాగాలను, కెమెరా లెన్స్‌లను కరిగించగలదు. అంతేకాకుండా దాని అధిక వేగంతో కూడిన గాలి ఫోన్ పైభాగంలో ఉన్న నీటిని మరింత లోపలికి నెట్టగలదు.బియ్యం కుండలో పాతిపెట్టడం: ఇది పాత బేసిక్ మోడల్ ఫోన్‌లకు సరిపోవచ్చు. అయితే ఇది నేటి ఆధునిక స్మార్ట్‌ఫోన్‌లకు తగినది కాదు. బియ్యంలోని చిన్న రేణువులు, పిండి, ధూళి ఫోన్ ఛార్జింగ్ పోర్ట్, స్పీకర్ రంధ్రాలు, హెడ్‌ఫోన్ జాక్‌లో ఇరుక్కుపోవచ్చు. వెంటనే ఛార్జింగ్ పెట్టొద్దు: మీ ఫోన్ తడిచిన బెట్టడం: హెయిర్ డ్రైయర్ నుండి వెలువడే తీవ్రవెంటనే ఛార్జర్‌కు పెట్టవద్దు. అలా చేయడం వల్ల విద్యుత్ షాక్ తగిలి, ఫోన్ పేలిపోవచ్చు లేదా దానిలోని ఎలక్ట్రానిక్ భాగాలు పూర్తిగా దెబ్బతినవచ్చు.చేయవలసిన పనులు:సిమ్ కార్డ్ ట్రేను తీసివేయడం: ఫోన్‌ను శుభ్రమైన గుడ్డతో తుడిచిన తర్వాత మీరు ముందుగా సిమ్ కార్డ్ ట్రేను తీసివేయాలి. దీనివల్ల ఫోన్ లోపల గాలి పీడనం తగ్గి, లోపల ఉన్న తేమ మరింత సులభంగా బయటకు పోతుంది.వాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించడం: మీరు ఫోన్ రంధ్రాల దగ్గర తక్కువ శక్తి గల వాక్యూమ్ క్లీనర్‌ను ఉంచితే, అది లోపల ఉన్న నీటి బిందువులను సులభంగా పీల్చేస్తుంది .సహజంగా ఆరబెట్టడం: ఫోన్ లోపల ఉన్న నీటిని ఆరబెట్టడానికి అత్యంత సురక్షితమైన మార్గం ఏమిటంటే దానిని పరుపు దుప్పటి వంటి ఒక పత్తి గుడ్డపై ఉంచండి. ఆ తర్వాత ఫ్యాన్‌ను ఆన్ బెట్టడం: హెయిర్ డ్రైయర్ నుండి వెలువడే తీవ్రచేసి, దానిని 24 గంటల పాటు అలాగే వదిలేయండి.ఉప్పు నీటిలో లేదా మురుగునీటిలో పడితే: మీ ఫోన్ మురుగునీటిలో లేదా ఉప్పునీటిలో పడితే వెంటనే దాన్ని స్విచ్ ఆఫ్ చేసి, దాని ఉపరితలాన్ని శుభ్రమైన, తాజా నీటితో తేలికగా తుడవండి. లేకపోతే ఉప్పు, మురికి ఫోన్ లోపల ఉన్న రాగి తీగలను నెమ్మదిగా తుప్పు పట్టించి దానిని పూర్తిగా నాశనం చేస్తాయి.

## శివుడికి విభూతి అంటే ఎందుకంత ఇష్టం దీని వెనుకున్న ఆధ్యాత్మిక రహస్యం ఏమిటో తెలుసా?

మన పురాణాల ప్రకారం విష్ణువు అలంకార ప్రియుడు. శివుడు అభిషేక ప్రియుడు. కాసిని నీళ్లతో అభిషేకించి విభూతితో అలంకరిస్తే చాలు కోరిన వరాలను ఆ భోళాశంకరుడు అనుగ్రహిస్తాడు. అసలు పరమేశ్వరునికి విభూతికి ఉన్న సంబంధం ఏమిటి? శివునికి విభూతి అంటే ప్రీతి ఎందుకు? సనాతన ధర్మంలో వివరించిన విభూతి యోగం అంటే ఏమిటి? అనే ఆసక్తికర విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.



### దైవత్వానికి చిహ్నం

సాధారణంగా శివాలయాల్లో, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో, వినాయకుని ఆలయాల్లో విభూతిని ఇస్తుంటారు. అలాగే శివోపాసకులైన శైవులు ఎల్లప్పుడూ విభూతి ధరించి ఉంటారు. శివుడు అభిషేక ప్రియుడు. శివునికి అన్ని ద్రవ్యాల కన్నా విభూతితో అభిషేకిస్తే పరమ ప్రీతి చెంది వరాలు కురిపిస్తాడంట. విభూతిలో నిగూఢంగా ఉన్న దైవత్వమే ఇందుకు కారణమని అంటారు.

### విభూతి యోగం

భగవద్గీతలోని 10వ అధ్యాయాన్ని 'విభూతి యోగం' అంటారు. విభూతి అనగా భగవంతుని విశిష్టమైన ఐశ్వర్యం, మహిమ, అద్భుతమైన శక్తి అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో వివరించారు. పరమేశ్వరునికి ప్రీతికరమైన ఈ విభూతి వెనుక దాగిఉన్న తత్వం ఏమిటో చూద్దాం.

### విభూతే ఆభరణం!

పరమేశ్వరునికి ఆడంబరాలంటే నచ్చవు. ఆయన నివాసం మంచు కొండల్లోని కైలాసం. ఆయన ఎల్లప్పుడూ శ్మశానంలో సంచరిస్తాడు కాబట్టి శ్మశానవాశి అనే నామధేయం కూడా ఉంది. శివుడు భౌతికమైన వస్త్రాలు బదులు జంతు చర్మాన్ని ధరిస్తాడు. ఆభరణాలకు బదులు విభూతిని అలంకరించుకుంటాడు. ఈ విధంగా శివుడు విభూతిని ధరించడంలో ఆధ్యాత్మిక, తాత్విక పరమార్థాలు దాగి ఉన్నాయి. భగవంతుడికి ప్రాపంచిక ఆడంబరాలు, ఆభరణాలు అవసరం లేదని, ఆయన సకల భౌతిక బంధాలకు అతీతమైన వైరాగ్య స్వరూపుడని తెలియజేయడమే ఇందులోని అంతరార్థం.

### లయకారుడు శివుడు

సృష్టి స్థితి లయ అనే మూడు కార్యాలలో శివుడు లయం చేసేవాడు కాబట్టి ఆయనను లయకారుడని అంటారు. లయం అంటే మృత్యువుకు సంకేతం. ప్రళయకాలంలో సృష్టిని లయం చేసేవాడు పరమశివుడు కాబట్టి ఆయనను లయకారుడని అంటారు.

### జీవిత సత్యం విభూతి

ఎంత గొప్ప వాళ్లు అయినా మరణించాక పిడికెడు భస్మం కావాల్సిందే! భస్మం అంటే విభూతి. అందుకే విభూతి మనిషి జీవిత అంతిమ సత్యం. ఎంత సంపాదించినా ఏదో ఒకరోజు సమస్త ప్రాణులు, భౌతిక శరీరం, ప్రాపంచిక ఆస్తిపాస్తులు సకలం బూడిదవ్వాల్సిందే! అగ్ని ఎలాగైతే సమస్తాన్ని దహించి స్వచ్ఛమైన బూడిదను మిగులుస్తుందో, శివుడు కూడా తనను ఆశ్రయయించిన వారి పాపాలను దహించివేస్తాడని అంటారు.

### శ్మశానవాసి

దిగంబరుడైన పరమేశ్వరుడు శ్మశానవాసి. రుద్రభూమిలో అందరూ సమానమే! ఆ స్వామి రంగు రూపు లేని విభూతిని ధరించడం ద్వారా ఈ తత్వాన్ని అందరికీ బోధిస్తాడు.

### విభూతి ధారణ విశిష్టత

ఇంతటి విశిష్టమైన విభూతిని ధరించడానికి ఓ పద్ధతి ఉంది. సాధారణంగా విభూతిని నుదుట, చాతి దగ్గర, గొంతు భాగంలో పెట్టుకోవడం చూస్తుంటాం. ఇలా విభూతిని ధరించడం వల్ల శరీరంలో చక్రాలు, నాడులు ఉత్తేజితమవుత ాయని శాస్త్రం చెబుతోంది. సశాస్త్రీయంగా విభూతిని ఎలా ధరించాలో చూద్దాం.

విభూతి ధరించే పద్ధతి
ముందుగా విభూతిని కుడి చేతి మధ్య వేలు, ఉంగరపువేలు, బొటనవేలు సాయంతో ఎడమ అరచేతిలోకి తీసుకోవాలి. కుడిచేతి మూడు వేళ్లతో తూర్పు లేదా ఉత్తరం వైపు చూస్తూ, ఎడమ నుంచి కుడికి మూడు అడ్డగీతలు అంటే త్రిపుండ్రాలు నుదుటిపై ధరించాలి. కొంచెం విభూతిని నోటిలో కూడా వేసుకోవాలి.

### భస్మాభిషేకం

ఉజ్జయిని మహాకాళేశ్వరుని ఆలయంలో ప్రతిరోజు సూర్యోదయానికి ముందు మహాకాళేశ్వరునికి భస్మాభిషేకం జరుగుతుంది. ఇందుకోసం ఆ రోజు మరణించిన వ్యక్తిని దహనం చేయగా వచ్చిన భస్మాన్ని ఉపయోగిస్తారు. చివరకు మిగిలేది పిడికెడు బూడిదే అనే తత్వం అందరికీ అర్థం కావడం కోసమే శివుడు భస్మాభిషేకం చేస్తే ప్రీతి చెందుతాడు. ఇదే విభూతిలోని రహస్యం. జీవన పరమార్థం.

**ఓం నమః శివాయ!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

## మీ పిల్లల్ని ఈ ప్రశ్నలు అడుగుతున్నారా?



ఉదయాన్నే పిల్లల్ని స్కూలుకి సమయానికి పంపడంలో బిజీగా ఉంటారు. సాయంత్రం పనులు, వాళ్ల హోమ్?వర్క్?లతో హడావుడిగా గడిపేస్తుంటారు. ఇలా పిల్లల చుట్టూనే తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. కానీ, వాళ్లతో నిజంగానే గడుపుతున్నామా అంటే చెప్పడం కష్టమే. ఆ భావన వాళ్లకి కలగొద్దంటే.. వీటి గురించి కనుక్కోమంటున్నారు నిపుణులు.

స్కూలు ఎలా జరిగింది? : చాలామంది పేరెంట్స్ అడిగే ప్రశ్నే. దానికి పిల్లల నుంచి 'బాగానే ఉంది' అన్న సమాధానం రాగానే ఊరుకుంటాం. కానీ, పిల్లల్ని బాగా అర్థం చేసుకోవాలంటే అంతటితో ఆగొద్దంటున్నారు నిపుణులు. ఇంకా ప్రశ్నలు వేయాలట. సంభాషణ కొనసాగించాలని చెబుతున్నారు. అప్పుడే పిల్లలకి పంచుకోవడం అలవాటు అవుతుందని తెలియజేస్తున్నారు. దీంతో ఏదైనా ధైర్యంగా చెప్పడానికి ముందుకొస్తారట. అంతేకాదు, పిల్లల ఆలోచనా విధానం, పరిసరాలను, పరిస్థితులను ఎలా అర్థం చవిషయాలు తెలుస్తాయంటున్నారు. వారితో సమయం గడిపేందుకు ఇదొక మంచి మార్గంగానూ ఉంటుందని సూచిస్తున్నారు.

డోపమైన్ సహజంగా పెరగాలంటే – ఇలా చేయాలంటున్న నిపుణులు!ఈ రోజు మొత్తంలో నీకేం నచ్చింది? : ఇది ఒక చిన్న ప్రశ్నే! కానీ, చిన్నారులు సానుకూలతలు చూడటం అలవాటు చేసినవారు అవుతారట. 'ఈ రోజు టీచర్ మెచ్చుకున్నారు' అనగానే 'వావ్' అని బదులివ్వాలని నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న విజయాలను ఆస్వాదించడం నేర్పినవారు అవుతారట. ఆనందకర సంఘటనలను పంచుకునేలా ప్రోత్సహించడం ద్వారా ఆశావాద దృక్పథం అలవడుతుందని అంటున్నారు. మంచి విషయాలను గమనించడం నేర్చుకుంటారని పేర్కొంటున్నారు. ఇది పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందట.ఏదైనా బాధ కలిగిందా? : ఏ వయసుకి ఆ కష్టాలు ఉంటాయట. కాబట్టి, స్కూల్లో నచ్చని రోజులూ, సంఘటనలూ సర్వసాధారణమే. అందుకే వాటిని కనుక్కోవాలంటున్నారు నిపుణులు. ఫ్రెండ్స్?తో గొడవలు, చదువు ఒత్తిడి, పాఠం అర్థం కాకపోవడం ఇలా వాళ్లని ఇబ్బంది పెట్టేవీ చాలానే ఉన్నాయట. మీరు వీటి గురించి అడుగుతుంటే.. వాళ్ల చెప్పే క్రమంలో మానసిక భరోసా పొందుతారని చెబుతున్నారు. లోలోపలే బాధపడుతూ ఉండిపోక వాళ్ల అభద్రత భావాలను మీతో పంచుకుంటారట.

కొత్తగా ఈ రోజేం నేర్చుకున్నావ్? : పాఠం, నైపుణ్యం, క్రాఫ్ట్?, జోక్ బయటికి వచ్చేవి చాలానే ఉంటాయట. ఇలా రోజు అడుగుతుంటే.. వాళ్లలో తెలుసుకోవాలనే కోరిక, ఆత్మవిశ్వాసంతో పాటు నేర్చుకోవడంపై ఇష్టమూ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.సాయం చేశావా, తీసుకున్నావా? : ఈ ప్రశ్న పిల్లల్లో దయ, సహానుభూతిని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన వాళ్లకి సాయపడటంతో పాటు టీమ్? వర్క్?ను నేర్చుకుంటారట. అంతేనా, సాయం అవసరమైతే అడగాలి, సందేహించొద్దు అన్నదీ తెలుస్తుందని పేర్కొంటున్నారు.

ఇవి చూడటానికి చిన్న ప్రశ్నలా అనిపిస్తాయి. కానీ, పిల్లలకు మానసిక భరోసా, భద్రతను ఇస్తాయంటున్నారు నిపుణులు. తమకు ప్రాధాన్యం ఉందని భావిస్తారట. ఆలోచనలు, అనుభవాలు అన్నీ పంచుకుంటారని చెబుతున్నారు. సురక్షితంగా ఫీలవుతారని తెలియజేస్తున్నారు. పిల్లలకు కావాల్సింది సలహాలు కాదు.. తాము చెప్పేది వినేవాళ్లుట. అందుకే పిల్లలు చెప్పేది శ్రద్ధగా వినాలని సూచిస్తున్నారు. దీంతో పిల్లలు సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగడం గమనిస్తారట.

# అర్జీల పరిష్కారంలో జిల్లాను ముందంజలో నిలపాలి

- గడువులోగా పరిష్కారంతో పాటు నాణ్యతకూ పెద్దపీట వేయాలి
- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేదు
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 161 అర్జీలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, ఆగస్టు 31, 2026**
ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, నాణ్యమైన పరిష్కారం అందించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడం ద్వారా గ్రీవెన్స్ పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ 46, పోలీస్ 23, పురపాలక పట్టణ అభివృద్ధి 23, పంచాయతీరాజ్ 10 అర్జీలతో సహా మొత్తం 161 అర్జీలు అందాయి. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీదారుని సమస్య వాస్తవంగా పరిష్కరించబడిందా, ఆయన సంతృప్తి చెందారా అనేదే అర్జీ పరిష్కారానికి అసలు గీటురాయి అని స్పష్టం చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు అర్జీలను కేవలం కార్యాలయ స్థాయిలో పరిశీలించకుండా స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిశీలించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, నిబంధనల మేరకు న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రత్యేకించి జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కారం అనంతరం కూడా అర్జీదారుడి సంతృప్తి స్థాయిని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రజల సంతృప్తి, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, పరిష్కార నాణ్యతను ప్రధాన ప్రమాణాలుగా తీసుకుని అర్జీలను పరిష్కరించి, గ్రీవెన్స్ పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు అధికారుల సమష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆదేశించారు. స్వచ్ఛాంధ్రలో జిల్లా మెరవాలి:స్వచ్ఛాంధ్ర-2026 అవార్డుల విషయంలో జిల్లాకు ఎక్కువ అవార్డులు సాధించేలా అధికారులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రతి శాఖ, స్థానిక సంస్థ తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వాటి ఫలితాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఓబీసీ సెల్ నూతన కమిటీలకు దరఖాస్తుల ఆహ్వానం...!

**డిసిసి అధ్యక్షులు లాకవత్ ధనవంతి లక్ష్మీనారాయణ నాయక్...!!**



**జనగామ, ఆగస్టు 31**
జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో... ఓబీసీ సెల్ నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 3వ తేదీన ప్రారంభం కానుంది. జిల్లా, అసెంబ్లీ, డివిజన్, మండల, టౌన్ మరియు గ్రామ స్థాయిలలో ఛైర్మెన్ మరియు కమిటీ సభ్యుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జనగామ డీసీసీ కార్యాలయంలో సమర్పించాలని డిసిసి అధ్యక్షులు లాకవత్ ధనవంతి లక్ష్మీనారాయణ నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే అనుభవం, ఆసక్తి, నిబద్ధత మరియు క్రమశిక్షణ కలిగిన నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ సెల్ అబ్జర్వర్లు తిరుపతి, రవీందర్, బాలు యాదవ్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల మల్లేష్, జనగామ పట్టణ అధ్యక్షుడు ధోర్నాల వెంకటేశ్వర్లు, ఓబీసీ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ చింతకింది మల్లేష్, కర్రే రాజశేఖర్, జాయ మల్లేష్, ఎదునూరి రవీందర్, మచ్చ ప్రవీణ్, కళ్యాణం సమ్మయ్య అలీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు అనువైన గమ్యం.. ఎన్‌టీఆర్ జిల్లా

- ఇన్వెస్టర్స్ డెస్క్ ప్రతిపాదనలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు సమిష్టి కృషి
- డీఐఈపీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**విజయవాడ, ఆగస్టు 31, 2026**
ఎన్‌టీఆర్ జిల్లా పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన గమ్యస్థానమని.. పారిశ్రామికవేత్తలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నామని, జిల్లా ల్యాండ్ బ్యాంకుపైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులు, భూముల లభ్యత తదితరాలపై చర్చించారు. 2026, మే 26 నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా శాఖల వారీ పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 258 దరఖాస్తులు రాగా.. వీటిలో ఇప్పటికే 226 దరఖాస్తులు ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించగా మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం (2015-20), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2020-23), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2023-27), ఈడీపీ (2024-29) పథకాల కింద ఎంఎస్ఎంఈ రంగానికి అందించే పెట్టుబడి రాయితీ, వడ్డీ, విద్యుత్ బిల్లుల రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలలో భాగంగా 22 క్లెయిమ్‌లకు రూ. 3.24 కోట్లు మేర ప్రతిపాదనలను తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూముల లభ్యతపై వేగంగా సమాచారం అందించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూముల కేటాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి చొరవచూపుతున్నట్లు తెలిపారు. 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నవంబర్‌లో విశాఖపట్నంలో జరగనున్న నేపథ్యంలో విజయవాడలో అక్టోబర్‌లో రీజనల్ పార్టనర్‌షిప్ సమ్మిట్ జరుగుతుందని.. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ర్యాంప్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక చర్యలు:ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పోటీతత్వాన్ని పెంచేందుకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్‌ఫార్మెన్స్ (ర్యాంప్) కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 2న విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్ భారీ ఎత్తున జరగనుందని.. ఇందులో ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, వి.మురళీకృష్ణ (ఫాప్సియా), కనకదుర్గ (అలెప్), ఆర్‌డీవోలు పాల్గొన్నారు.

# నారాయణపురం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బండ్ల ఉమా చారి...!

**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 31**



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామంలో... కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ... పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో బండ్ల ఉమా చారి... కీలకంగా కృషి చేశారని కార్యకర్తలు తెలిపారు. ఆయన పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందించారు. ఆయన సేవలను గుర్తించిన కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల ఉమా చారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్న పార్టీ కార్య కర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరిదే స్వప్న శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ మసూద్, జిల్లా నాయకులు దాత్రపు నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు హరీష్, గుర్రపు బాలరాజు, జంగిటి నరేష్ , బొట్టు గణపతి పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా

- 13 స్వర్ణం, 12 రజత పతకాలు కైవసం
- పతక విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష





**విజయవాడ, ఆగస్టు 31, 2026**
రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఎన్‌టీఆర్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. క్రీడల్లో ప్రతిభను నిరూపించుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ వేదికలు, శిక్షణ, ప్రోత్సాహకాలు, వనరులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. 2026, ఆగస్టు 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన అమరావతి స్టేట్ లెవల్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్‌టీఆర్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోని క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, యోగా విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలంటే ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని.. రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.కోటేశ్వరరావు, కోచ్‌లు భాస్కర్ (బ్యాడ్మింటన్), నవీన్ కుమార్ (ఆర్చరీ), స్వామి (వెయిట్ లిఫ్టింగ్), ఇషాక్, చిరంజీవి (బాక్సింగ్), సంతోష్ (బాస్కెట్‌బాల్), ఆంజనేయులు, శిరీష (యోగా), క్రీడాకారులు పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**రాజాపేట ఆగస్టు 31**




రాజపేటలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 8.9.10. తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే. ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మాట్లాడుతూ మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రైవేటు కాంట్రాక్టు రంగంలో పనిచేస్తున్న యువకులకు కనీస వేతనం భద్రత సామాజిక భద్రత కల్పించాలని కోరారు రాబోయే రోజులలో యువత సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి మూల పోచయ్య దయ్యాలసిద్ధులు కొయ్య బాబు బొద్దుల మహేష్ తరిగొప్పుల సిద్దు లు నాగారం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలి



**చిట్యాల, ఆగస్టు 31**

చేనేత, గీత కార్మికులకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్లు అందిస్తున్న మాదిరిగానే నాయి బ్రాహ్మణ క్షవరవృత్తి కార్మికులకు సైతం 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేయాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. తరతరాలుగా కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయి బ్రాహ్మణులు వయసు పెరిగే కొద్దీ కంటి చూపు తగ్గడంతో క్షవరవృత్తి చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు అమరోజు వెంకటేశం నాయి, ప్రధాన కార్యదర్శి అమరోజు శ్రీరాములు నాయి, జిల్లా నాయకులు చికిలం మెట్ల అశోక్, అమరోజు వెంకన్న, చికిలం మెట్ల సైదులు, జంపాల వెంకన్న, మహాలింగం, సురేష్, నరసింహ, సత్తయ్య పాల్గొన్నారు..

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి:

**- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన ఎస్ఎఫ్ఐ**




**చిట్యాల, ఆగస్టు 31**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం చిట్యాల మున్సిపల్ కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు ఆరూరి ప్రణీత్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థులను ఐక్యం చేసి మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చిట్యాల మండల కన్వీనర్ చందు, కో-కన్వీనర్ యశ్వంత్, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## చేయూత పెన్షన్ గ డువుని పెంచాలి.

**- ఎం ఈ ఎఫ్ జిల్లా నాయకులు: ఇంజ మహేష్ మాదిగ**



**యాదాద్రి భువనగిరి ఆగస్టు 31**

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన నిరుపేదలకు అందిస్తున్నటువంటి చేత పింఛన్ గడువును ప్రభుత్వం వెంటనే పెంచాలని.. ఎంఈ ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు ఇంజా మహేష్ మాదిగ కోరారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన చదువురాని నిరుపేద కుటుంబానికి చెందిన ప్రజలు చేయూత పెన్షన్ కు కావలసిన సర్టిఫికెట్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో చాలామంది కుల దృవీకరణ ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ సదరం సర్టిఫికెట్ తీసుకోవడం ఆలస్యం అవుతున్నది. ఇలాంటి సర్టిఫికెట్స్ ఎమ్మార్వో ఆఫీసులో గాని, ఇతర కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడం, కొందరు బిజీగా ఉండడంవల్ల అర్హులైన నిరుపేద కుటుంబాలు ఈ పథకాన్ని అందుకోలేకపోతున్నాయి. కావున ప్రభుత్వం ఆలోచించి గడువును పెంచాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

## గంధ మల్ల లో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రశీ



**తుర్కపల్లి, ఆగస్టు 31**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుర్రపాటి అశోక్ ప్రమీల ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా సర్పంచ్ బొత్త రాములు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో వారు అందించిన సేవలు కొనియాడుతూ వారి విరమణ అనంతరం జీవితం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు .ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఆలేరు ఆత్మ కమిటీ డైరెక్టర్ జింకల ఎల్లేష్ యాదవ్, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, పాల సంఘం చైర్మన్ సాగ బాలరాజు, వార్డు సభ్యులు గడిపే నర్సింలు, జిట్ల గణేష్ ఆంజనేయులు శాప కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**●పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సీపీ**












**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్)**

పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (SCSC), గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ సీటీసీలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం సీపీ డా. ఎం. రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా కంటి పరీక్ష, బీపీ పరీక్ష చేయించుకున్నారు. శిబిరంలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి శిబిరంలో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, అందుబాటులో ఉన్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఎత్తు, బరువు, BMI, ECG, కంటి పరీక్షలు, దంత పరీక్షలు తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. చిన్నారుల కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఐ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవలను కూడా అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది నిరంతరం ఒత్తిడి, పని భారాన్ని ఎదుర్కొంటున్నందున వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పోలీసు ఉద్యోగి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయిం చుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలను ప్రారంభ దశ లోనే గుర్తించి తగిన వైద్య సేవలు పొందడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య వివరాలను 'ఆరోగ్య భద్రత' హెల్త్ ప్రొఫైల్‌లో నమోదు చేసి HRMSలో అప్‌లోడ్ చేయాలని యూనిట్ వైద్యులకు సీపీ సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉండ టం వల్ల భవిష్యత్తులో అవసరమైన సమయంలో వారి ఆరోగ్య చరిత్రను సులభంగా పరిశీలించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు, ప్రజలు కూడా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకోవాలని సీపీ సూచించారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 5 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజూజ క్యాంపస్‌లో ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, స్ సి స్ సి సీఈఓ నవీద్, హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డీసీపీ షమీర్, సీటీసీ వైద్యులు సుకుమార్, సరిత, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వైద్య బృందం పాల్గొన్నారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్లపై చర్యలు సరికాదు

- ● పెద్దపల్లిలో 31 మంది లైసెన్సుల రద్దుపై ఉద్యమం
- ● కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ
- ● నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే న్యాయపోరాటం తప్పదు: తెలంగాణ లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం




**రామగుండం ఎన్టీపీసీ ఆగస్టు 31 (పీపుల్స్ న్యూస్):**

పెద్దపల్లి జిల్లాలో 31 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్సులను ఒకేసారి రద్దు చేయడాన్ని తెలంగాణ లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా ఒక్క పెద్దపల్లిలోనే ఈ స్థాయిలో లైసెన్సులు రద్దు చేయడం అన్యాయమని సంఘం నాయకులు మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని వెంటనే పునఃపరిశీలించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం, కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనం తరం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు అనిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నగర రమేష్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ మాట్లాడారు.

**ఉపాధి చూపకుండా వేధింపులు:**

ప్రజల భూ సమస్యలను పరిష్కరించేందుకు 2025లో శిక్షణ ఇచ్చి లైసెన్సులు మంజూరు చేసినప్పటికీ, ప్రభుత్వం వారి సేవల ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని నాయకులు ఆరో పించారు. పనులు అప్పగించకుండా కాలయాపన చేయడంతో సర్వేయర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి, సాదాబైనామా, భూ రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి సర్వే వంటి అంశాల్లో తమ సేవలను భాగస్వామ్యం చేస్తే భూ వివాదాలు గణనీయంగా తగ్గుతాయని సూచించారు.

**కారణాలు చెప్పకుండా రద్దు చేయడం విడ్డూరం:**

ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలకు తమ అభ్యంతరం లేదని, కానీ ఎలాంటి విచారణ లేకుండా, స్పష్టమైన కారణాలు తెలపకుండా లైసెన్సులు ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన సర్వేయర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సర్వేయర్లకు స్థిరమైన ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు, ఉపాధ్యక్షుడు అరవింద్, సలహాదారు గోవర్ధన్, జిల్లా నాయకులు తిరుపతి, సురేష్, గోపి, అభిలాష్‌తో పాటు పలు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పిఓ) శ్రీ లెనిన్ వత్సల్ తోప్పో ఐ.ఎ.ఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన స్థానిక ప్రజాప్రతినిధులు

**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 31( పీపుల్స్ న్యూస్)**

ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఓ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ లెనిన్ వత్సల్ తోప్పో ఐ.ఎ.ఎస్ ని ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు సోమవారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు

ఈ సందర్భంగా పిఓ కి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏటూరునా గారం మండలంలోని పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై పిఓ తో చర్చించారుఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు , ఎండి వలీ బాబా, తాడూరి రఘు, తాటి కృష్ణ, కర్ర రవీందర్, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, పులుసం పురుషోత్తం, తురం పద్మ ధనలక్ష్మి, బాడిష నాగ రమేష్, కుమ్మరి చంద్రబాబు, కాకులమర్రి భాస్కరరావు,



అరుణమ్మ, రెడ్డి ప్రమీల, ముడిగల నరేష్, పలువురు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.బి

# వైభవ్ సూర్యవంశీ చేజారిన శతకం



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92)తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బెంగళూరులోని బీసీసీఐ సీఓఈ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ.. వన్డే తరహా బ్యాటింగ్‌తో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన ఫియర్‌లెస్ బ్యాటింగ్‌తో మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపించాడు. తనకే సాధ్యమైన భారీ సిక్సర్లతో బౌలర్లకు చుక్కలు చూపించాడు. 42 బంతుల్లోనే 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో అర్ధశతకం పూర్తి చేసుకున్న వైభవ్.. ఫాస్టెస్ట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ హర్ష్‌దూబే బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌండరీ లైన్‌పై అర్షద్ ఖాన్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ముగిసింది. 8 పరుగుల దూరంలో సెంచరీ చేజారడంతో వైభవ్ సూర్యవంశీ తీవ్ర అసహనానికి గురయ్యాడు. మైదానం వీడే క్రమంలో బ్యాట్‌ను బలంగా నేలకు కొట్టి అసహనం వ్యక్తం చేశాడు. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ బాదిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్రకెక్కాడు. 15 ఏళ్ల 175 రోజుల వయసులో వైభవ్ ఈ ఘనత సాధించి 57 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 1969లో లక్ష్మణ్ సింగ్ 16 ఏళ్ల 23 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో హాఫ్ సెంచరీ బాదగా.. ఆ రికార్డ్‌ను తాజాగా వైభవ్ సూర్యవంశీ అధిగమించాడు. అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి తొలి వికెట్‌కు వైభవ్ 161 పరుగులు జోడించాడు. కానీ అతను ఔటైన తర్వాత ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. మరో 105 పరుగులు మాత్రమే జోడించి 57 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్(69) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో హర్ష్ దూబే(4/66) నాలుగు వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్, ఆర్యన్ పాండే మూడేసి వికెట్లు పడగొట్టారు. దాంతో ఈస్ట్ జోన్‌కు ఒక్క పరుగు కూడా ఆధిక్యం దక్కలేదు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. కునాల్ చందేలా(2), ఆర్యన్ జుయాల్(8), రజత్ పాటిదార్(5) విఫలమవ్వగా.. క్రీజులో అమన్ మోకడే(23 బ్యాటింగ్), ఆర్యన్ పాండే(4 బ్యాటింగ్)లు ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్.. 80.1 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రింకూ సింగ్(88 బంతుల్లో 8 ఫోర్లతో 60) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆర్య జుయల్(113 బంతుల్లో 6 ఫోర్లతో 46) హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(3/56), అభిజిత్ సర్కార్(3/38) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, మహమ్మద్ కౌనైన్ రెండేసి వికెట్లు తీసారు.

# హార్దిక్, నితీష్ రెడ్డి రీఎంట్రీ!

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. మళ్లీ వైట్ బాల్ ఫార్మాట్‌కు సిద్ధమైంది. సొంతగడ్డపై సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య అఫ్గానిస్థాన్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సిరీస్ ఆడే భారత జట్టును బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. అజిత్ అగార్కర్ సారథ్యంలో సెలెక్షన్ కమిటీ.. టీమ్ ఎంపికపై ఫోకస్ పెట్టింది. మరో రెండు రోజుల్లో జట్టును ప్రకటించే అవకాశం ఉంది. గాయాలతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ)లో ఉన్న సంగతి తెలిసిందే. వాషింగ్టన్ సుందర్ సీవోఈలో ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం అతను చెన్నైలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మరోవైపు జస్‌ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకున్నా.. అతని విషయంలో టీమ్‌మేనేజ్‌మెంట్ ఆచితూచి వ్యవహరిస్తోంది. భవిష్యత్తులో కీలక టెస్ట్ టెస్ట్ సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు బుమ్రాను దూరంగా ఉంచే అవకాశాలు ఉన్నాయి. 'అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్ కోసం జట్టు ఎంపికపై సెలెక్షన్ కమిటీ ఫోకస్ పెట్టింది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించే ఆటగాళ్లను పరిగణనలోకి తీసుకుంటారు. నితీష్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా చాలా రోజుల నుంచి సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నారు. వ్యక్తిగత కమిట్‌మెంట్స్ కోసం అప్పుడప్పుడు బయటకు వెళ్లినా ఎక్కువ సమయం సీఓఈలోనే గడిపారు. హార్దిక్ పాండ్యా అయితే బెంగళూరులోనే స్థిరపడ్డాడు. సుందర్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సెలెక్షన్స్‌కు అందుబాటులోకి వస్తాడు.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా పేరును కూడా సెలెక్టర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాటింగ్ సామర్థ్యంతో పాటు టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లు బౌలింగ్ చేసే కృనాల్‌ను టీమిండియాలోకి తీసుకోవాలని సెలెక్టర్లు భావిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన స్థానాన్ని నిలబెట్టుకోనున్నాడు. అఫ్గాన్‌తో భారత టీ20 జట్టు(అంచనా) వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్/గుర్నూర్ బ్రార్, కృనాల్ పాండ్యా/వాషింగ్టన్ సుందర్, యశ్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణ.




# తొలి రౌండ్‌లోనే ముగిసిన జకోవిచ్ ప్రయాణం

తీవ్రమైన ఎండ, తేమ, అనారోగ్యం, శారీరక అలసటతో పోరాడిన జకోవిచ్.. అర్జెంటీనా ఆటగాడు మరియానో ??నవోన్‌తో జరిగిన మారథాన్ ఐదు సెట్ల పోరులో 6-7, 7-5, 6-4, 2-6, 1-6 తేడాతో ఓటమిపాలయ్యాడు. ఆర్థర్ యాష్ స్టేడియంలో మ్యాచ్ ఆరంభం నుంచే జకోవిచ్ శారీరకంగా ఇబ్బంది పడుతూ కనిపించాడు. న్యూయార్క్‌లోని తీవ్ర ఉక్కపోత, తేమ వాతావరణం వల్ల తలపై పదే పదే ఐస్ బ్యాగ్ పెట్టుకున్నాడు. వర్షం కారణంగా స్టేడియం రూఫ్ మూసివేసినప్పుడు ఏసీ ఆన్ చేయాలని సూపర్‌వైజర్‌ను కూడా కోరాడు. మూడో సెట్ ఆరో గేమ్‌లో పరిస్థితి మరింత విషమించి, జకోవిచ్ కోర్టు వెనుకభాగంలో పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. టోర్నమెంట్ ఫిజియో అతనికి మాత్రలు అందించగా, కోర్టు పక్కనుంచి సహాయక బృందం ద్రవాలు అందించింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 6-7తో కోల్పోయినప్పటికీ, తీవ్రమైన శారీరక ఇబ్బందుల నడుమ జకోవిచ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్‌ను 7-5తో, మూడో సెట్‌ను 6-4తో గెలుచుకుని విజయానికి కేవలం ఒక్క సెట్ దూరంలో నిలిచాడు. అయితే, యువ ఆటగాడు నవోన్ తగ్గకుండా నాలుగో సెట్‌ను 6-2తో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లో నవోన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 4-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అప్పటికే శరీరం సహకరించక, శక్తి పూర్తిగా క్షీణించడంతో మ్యాచ్ చేజారిపోతోందని గ్రహించిన జకోవిచ్ కోర్టులోనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. గ్యాలరీలో ఉన్న ఆయన భార్య జెలెనా కూడా తీవ్ర ఆందోళనకు గురైంది. నవోన్ ఏమాత్రం తడబడకుండా ఐదో సెట్‌ను 6-1తో ముగించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. 25వ టైటిల్ కల నిరీక్షణ: మార్గరెట్ కోర్ట్ రికార్డును అధిగమించి 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలవాలన్న జకోవిచ్ కల ఈ ఓటమితో ప్రస్తుతానికి ఆగింది. జిమ్మీ కానర్స్ రికార్డు మిస్: యూఎస్ ఓపెన్‌లో జిమ్మీ కానర్స్ పేరిట ఉన్న 98 విజయాల రికార్డును దాటడానికి జకోవిచ్‌కు ఇంకా నాలుగు విజయాలు అవసరమున్న సమయంలో ఈ ఓటమి ఎదురైంది. 18 ఏళ్ల అజేయ రికార్డుకు తెర: గ్రాండ్‌స్లామ్ టోర్నీల తొలి రౌండ్లలో వరుసగా 78 మ్యాచ్‌లు గెలిచిన జకోవిచ్ రికార్డుకు ఈ మ్యాచ్‌తో తెరపడింది. గతంలో 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్ గోల్డ్‌స్టిన్ చేతిలో ఓడిన తర్వాత, మళ్లీ ఇన్నాళ్లకు జకోవిచ్ గ్రాండ్‌స్లామ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

ఫుట్‌బాల్ ప్రపంచంలో సంచలన నిర్ణయం చోటుచేసుకుంది. అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. ఇకపై అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించబోనని ఆయన వెల్లడించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్‌తో ఓటమి ఎదురైన రెండు రోజుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెస్సీ తెలిపారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. జాతీయ జట్టుకు దూరమవ్వాలనే నిర్ణయం ఎంతో బాధాకరంగా ఉందని మెస్సీ పేర్కొన్నారు. చాలా కాలంగా ఆలోచించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఇన్నేళ్లుగా అర్జెంటీనా జెర్సీ కోసం తన శక్తిమేర పోరాడానని, దేశ ప్రజలను సంతోషపెట్టడం, అర్జెంటీనాగా గర్వపడేలా చేయడం తనకు ఎప్పుడూ ముఖ్యమని వివరించారు. మెస్సీ తన ప్రకటనలో.. ఇది తనను తీవ్రంగా కలచివేసిన నిర్ణయమని, ఇప్పటికీ ఆ బాధ తనలో ఉందని తెలిపారు. ఇటీవలి సంవత్సరాల్లో జట్టుతో కలిసి ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, అంతకుముందు కాలంలోనూ జాతీయ జట్టు కోసం పూర్తిస్థాయిలో కష్టపడ్డానని గుర్తుచేసుకున్నారు. తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి దశకు చేరుకున్నానని మెస్సీ అభిప్రాయపడ్డారు. కొన్ని అధ్యాయాలు ముగిసే సమయం వచ్చిందని, వాటిలో జాతీయ జట్టు అధ్యాయం ముగియడం తనకు ఎంతో బాధ కలిగిస్తోందన్నారు. అర్జెంటీనా జట్టులో భాగం



కావడాన్ని తాను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటానని చెప్పారు. తనవంతుగా ఇవ్వాల్సినదంతా ఇచ్చేశానని, ఇక తన స్థానాన్ని కొత్త తరం ఆటగాళ్లకు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. జాతీయ జట్టుకు మద్దతుగా నిలిచిన అభిమానులకు మెస్సీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లుగా తనపై చూపిన ప్రేమ, మద్దతును ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఇకపై స్టేడియం లోపల నుంచి అభిమానుల గొంతులు వినడం మిస్ అవుతానని, అయితే బయట నుంచి అర్జెంటీనా జట్టుకు మద్దతు ఇస్తూ ఉంటానని తెలిపారు. మంచి సమయాల్లోనే కాకుండా, ముఖ్యంగా కష్టకాలంలో జట్టుకు అండగా ఉంటానని చెప్పారు. తన కుటుంబానికి, ఈ ప్రయాణంలో తనతో కలిసి నడిచిన కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, అధికారులు, సిబ్బందికి కూడా మెస్సీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రయాణం అందమైనదే కాకుండా ఎంతో కఠినమైనదని, అయినప్పటికీ తనకు ఎన్నో మరచిపోలేని జ్ఞాపకాలను అందించిందన్నారు. తన సహచరులతో కలిసి అభిమానులు కలలో కూడా ఊహించని ఎన్నో క్షణాలను సృష్టించగలిగామని మెస్సీ అన్నారు. ఆ అనుభవం తనకు అద్భుతంగా అనిపించిందని పేర్కొంటూ అభిమానులపై తన ప్రేమను వ్యక్తం చేశారు. చివరగా "అర్జెంటీనావాడిగా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అంటూ భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం "లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన ప్రకటనను ముగించారు.

# ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. ఇంగ్లండ్‌కు కనీస పోటీ ఇవ్వలేకపోయింది. తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో చిత్తయిన పాకిస్థాన్.. తాజాగా లార్డ్స్ టెస్ట్‌లో 194 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.దాంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 0-2తో కోల్పోయింది. ఈ పరాజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. పాకిస్థాన్‌తో పాటు ఇంగ్లండ్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరలేని పరిస్థితి నెలకొంది. ఈ పరాజయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్‌తో పాటు ఇమామ్ ఉల్ హక్‌ను జట్టు నుంచి తప్పించి పాకిస్థాన్‌కు పంపించాలని నిర్ణయించిందని జియో న్యూస్ పేర్కొంది. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైలెవెల్ మీటింగ్ నిర్వహించిందని కూడా తెలిపింది. ఈ సమావేశంలో పీసీబీ ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ, సీఓఓ సుమైర్ అహ్మద్, పీఎస్‌ఎల్ సీఈఓ సల్మాన్ నజీర్, సీనియర్ సెలెక్టర్ అకీబ్ జావెద్, పరిమిత ఓవర్ల హెడ్ కోచ్ మైక్ హెస్సెన్ హాజరయ్యారని పేర్కొంది. ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ కంటే పాకిస్థాన్ ఘోర పరాజయాలే తీవ్ర అసంతృప్తికి గురి చేశాయని పీసీబీ




ఛైర్మెన్ అన్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. 'రెండో టెస్టు సందర్భంగా స్కై స్పోర్ట్స్‌లో ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ ప్రసారం కావడం కూడా అధికార వర్గాలను కలవరపెట్టింది. కానీ అన్నింటికన్నా ఎక్కువగా.. మీడియాలో పాకిస్తాన్ జట్టును చిత్రీకరించిన తీరు, వారి ప్రదర్శనే ఆందోళన కలిగించాయి. ఇమామ్ తీవ్ర చిక్కుల్లో ఉన్నాడు. అతని స్థానంలో అబ్దుల్లా ఫజల్ జట్టులో చేరుతాడు.'అని ఓ పీసీబీ అధికారి తెలిపాడు. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించాలనే యోచనలో పీసబీ ఉన్నట్లు తెలుస్తోంది. సర్ఫరాజ్ అహ్మద్ స్థానంలో పరిమిత ఓవర్ల కోచ్ మైక్ హెస్సేన్‌కే టెస్ట్ టీమ్ బాధ్యతలు కూడా అప్పగించనున్నారని ప్రచారం జరుగుతోంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే మూడో టెస్ట్‌కు ముందే ఈ నిర్ణయం వెలువడనుందని జియో న్యూస్ పేర్కొంది.

# ఆసియా కప్: థాయిలాండ్‌పై భారత్ ఘన విజయం



**హైదరాబాద్ :** మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల భారీ తేడాతో విజయం నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోరులో ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపు అర్ధశతకంతో సత్తా చాటగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 36 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీక రావల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు చేసి రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3 వికెట్లు పడగొట్టగా, సునిద 2 వికెట్లు తీసింది. అనంతరం 160 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఆ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. థాయ్‌లాండ్ బ్యాటర్లలో కొంచరోయెంకాయ్ (41) మాత్రమే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారెవరూ కనీస పోరాట పటిమ కనబరచలేకపోయారు.

# కిరణ్ అబ్బవరం మూవీ హతః




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే




దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

## ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్

మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మ్లలెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.






# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

---------




# రోమాంచకం ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్

'యానిమల్', 'అర్జున్ రెడ్డి' వంటి ఇంటెన్స్, వయొలెంట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, ఆయన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ నుంచి ఓ యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో యువ నటుడు సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, 'రోమాంచకం' మూవీ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఊహించినట్టుగానే, ఈ ట్రైలర్‌కు ప్రేక్షకులు, నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. సందీప్ వంగా బ్రాండ్‌కు పూర్తి భిన్నంగా, ఆహ్లాదకరమైన వినోదంతో ట్రైలర్ ఉండటంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. 'మేమ్ ఫేమస్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ట్రైలర్ చూస్తుంటే ఇదొక కలర్‌ఫుల్, ఎనర్జిటిక్ రొమాంటిక్ కామెడీ అని స్పష్టమవుతోంది. డేటింగ్ యాప్ స్టార్టప్ నడిపే హీరో, తన వ్యాపారం కోసం చేసే పరిశోధనలో భాగంగా చెన్నైకి చెందిన హీరోయిన్‌తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని స్నేహితుల గ్యాంగ్‌తో కలిసి చేసే పనులు కొన్ని అనూహ్య సంఘటనలకు దారితీస్తాయి. ఈ క్రమంలో వచ్చే కామెడీ, సంఘర్షణలు ఆసక్తికరంగా ఉన్నాయి.

"రాస్తే రామాయణం... తీస్తే రోమాంచకం" అంటూ హీరో చెప్పే డైలాగ్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉండటంతో పాటు, నేపథ్య సంగీతం కూడా చాలా క్యాచీగా ఆకట్టుకుంటోంది. హింసకు తావు లేకుండా, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరించేలా ఒక క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచడంలో పూర్తిగా సక్సెస్ అయింది. ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం



వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com